సాక్షి
జోగులాంబ గద్వాల
గురువారం, 5, జనవరి, 2023



7 నుంచి బ్రహ్మోత్సవాలు
వర్ధమాపూర్ మైసమ్మ బ్రహ్మోత్సవాలు ఈ నెల 7వ తేదీ నుంచి ప్రారంభం కానున్నాయి.
వివరాలు 10లో ▸



అర్చక పరీక్షలకు సర్వం సిద్ధం
ఈ నెల 6, 7 తేదీల్లో నిర్వహించే అర్చక పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తిచేశారు.
వివరాలు 8లో ▸

గరిష్ఠం/కనిష్ఠం
32.2 /19.1

వాతావరణం
రోజంతా ఆకాశం సాధారణంగా ఉంటుంది. తెల్లవారుజామున మంచు కురుస్తుంది. రాత్రి చలి తీవ్రత తక్కువగా ఉంటుంది.

న్యూస్‌రీల్

వేరుశనగ క్వింటా రూ.8,111

గద్వాల వ్యవసాయం: గద్వాల మార్కెట్ యార్డుకు బుధవారం 775 క్వింటాళ్ళ వేరుశనగ రాగా, క్వింటాలుకు గరిష్ఠం రూ. 8111, కనిష్ఠం రూ. 4726, సరాసరి రూ. 6646 ధరలు లభించాయి. అలాగే, 18 క్వింటాళ్ళ ఆముదం రాగా గరిష్ఠం రూ. 6309, కనిష్ఠం రూ.5736, సరాసరి రూ. 6139 ధరలు పలికాయి. 198 క్వింటాళ్ళ వరి (సోన) రాగా, గరిష్ఠం రూ. 2323, కనిష్ఠం రూ. 1719, సరాసరిగా రూ. 1911 ధరలు వచ్చాయి. వీటితోపాటు 33 క్వింటాళ్ళ వరి (హంస) గరిష్ఠం , కనిష్ఠం, సరాసరిగా రూ. 1636 ధర పలికింది. 70 క్వింటాళ్ళ కంది రాగా, గరిష్ఠం రూ. 6806, కనిష్ఠం రూ. 6519, సరాసరి రూ. 6769 ధరలు వచ్చాయి.

పీజీలో ప్రవేశాలకు దరఖాస్తులు

గద్వాల అర్బన్: జిల్లా కేంద్రంలోని మహారాణి ఆదిలక్ష్మీ దేవమ్మ ప్రభుత్వ పీజీ కళాశాలలో పీజీ కోర్సుల్లో స్పాట్ అడ్మిషన్ల కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ శ్రీపతినాయుడు తెలిపారు. ఎంఎస్సీ మ్యాథ్స్, ఎంఏ ఎకనామిక్స్ కోర్సుల్లో సీట్ల భర్తీ కోసం పీజీ అర్హత పరీక్ష రాసిన, రాయని వారు సైతం పీజీ చేయడానికి స్పాట్ అడ్మిషన్ల కోసం దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి గల విద్యార్థులు ఈనెల 7వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని, పూర్తి వివరాలను కళాశాలలో లేదా సెల్ నం .9491490036కు సంప్రదించాలని పేర్కొన్నారు.

'మైనార్టీ' దరఖాస్తులు సమర్పించాలి

గద్వాల అర్బన్: మైనార్టీ కార్పొరేషన్ ఆర్థిక సహాయం పథకం బ్యాంకు లింక్డ్, నాన్ లింక్డు కేటగిరి–1,2 ద్వారా రుణాల కోసం ఆన్‌లైన్‌లో ఆప్లై చేసుకున్న దరఖాస్తుదారులు వారి దరఖాస్తులను సమర్పించాలని జిల్లా మైనార్టీ సంక్షేమశాఖ అధికారి ప్రసాద్ రావు ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తులను ఆయా మండల పరిషత్ అభివృద్ధి కార్యాలయం, మున్సిపల్ కమిషనర్‌కు కానీ సమర్పించాలని, మరిన్ని వివరాల కొసం 7013032567నంబర్‌కు సంప్రదించాలని తెలిపారు.

రేపటి నుంచి స్థాయీ సంఘాల సమావేశం

గద్వాల రూరల్: ఈనెల 4, 5వ తేదీలో నిర్వహించాల్సిన స్థాయి సంఘ సమావేశాలను ఈనెల 6, 7వ తేదీల్లో నిర్వహించనున్నట్లు జడ్పీ సీఈఓ విజయనాయక్ ఓ ప్రకటనలో తెలిపారు. 6వ తేదీన 2, 3, 4, 5వ స్థాయి సంఘ సమావేశాలు, 7వ తేదీన 1,6,7వ స్థాయి సంఘ సమావేశాలు నిర్వహిస్తున్నట్లు, అన్ని శాఖల అధికారులు తప్పకుండా హాజరు కావాలని తెలిపారు.

వైద్య ఆరోగ్య శాఖలో దరఖాస్తుల ఆహ్వానం

వనపర్తి క్రైం: జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ పరిధిలో వివిధ హెల్త్ వెల్‌నెస్ సెంటర్లలో పని చేసేందుకు మిడ్ లేవల్ హెల్త్ ప్రొవైడర్స్ 16 ఖాళీల భర్తీకిగాను దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు డీఎంహెచ్‌ఓ డా. రవిశంకర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు తమ బయోడేటాతో పాటు ధ్రువీకరణ పత్రం , రూ.500 డీడీ జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ, వనపర్తి పేరున తీసి గురువారం నుంచి 7వ తేదీ సాయంత్రం 5లోపు సమర్పించాలన్నారు. పూర్తి సమాచారం www.wanaparthy.telangana. nic.in వెబ్‌సైట్‌లో పొందుపర్చినట్లు వివరించారు.

నేటినుంచి ఉమ్మడి జిల్లా 'పాలిటెక్నిక్' క్రీడలు

మహబూబ్‌నగర్ క్రీడలు: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో బుధ, గురువారాల్లో ఉమ్మడి జిల్లా పాలిటెక్నిక్ క్రీడా పోటీలు నిర్వహించనున్నారు. ఈ మేరకు పాలిటెక్నిక్ కళాశాల మైదానంలో అన్ని ఏర్పాట్లు చేశారు. మహబూబ్‌నగర్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల, వనపర్తి పాలిటెక్నిక్, గద్వాల, కోస్గి, పెబ్బేర్, వడ్డేపల్లి, జెపీఎన్‌సీఈ (ధర్మాపూర్), స్విట్స్ కళాశాలల జట్లు పాల్గొంటున్నాయి. ఈ టోర్నీలో కబడ్డీ, వాలీబాల్, ఖోఖో, అథ్లెటిక్స్, టేబుల్‌టెన్నిస్, బ్యాడ్మింటన్, చెస్ క్రీడాంశాల్లో పోటీలు నిర్వహించనున్నారు.

అన్నదాత ఆగమాగం



ఈ ఫొటోలోని రైతు పేరు భూత జంగయ్య. జడ్చర్ల మండలం పెద్ద ఆదిరాలకి చెందిన ఆయన యాసంగి సీజన్‌లో రెండెకరాల పొలంలో వరి సాగుకు సమాయత్తమయ్యాడు. 20 రోజుల కింద నారు వేయగా.. మరో 10 రోజుల్లో చేతికి రానుంది. ఇక పొలంలో నీరుపెట్టి కరిగెట చేయాలనుకున్న క్రమంలో విద్యుత్ కోతలు అతడిని నైరాశ్యంలోకి నెట్టాయి. వ్యవసాయానికి ఉదయం 6 నుంచి సాయంత్రం 5 గంటల వరకే త్రీఫేజ్ కరెంట్ సరఫరా కావడం.. ఇందులోనూ అప్రకటిత కోతలు అమలవుతుండడంతో మడులు సిద్ధం చేసేందుకు నానా ఇక్కట్లు పడుతున్నాడు. కరెంట్ పోయి వచ్చినప్పుడల్లా తడిసిన మడికే నీరు అందుతోంది. చివరి మడికి నీరందని పరిస్థితుల్లో యాసంగి సాగుపై ఆలోచనలో పడ్డాడు. గతేడాది ఇదే సీజన్‌లో పంట చేతికొచ్చే సమయంలో నీళ్లు సక్రమంగా అందక చివరి మడులు ఎండి పోయాయని.. ఇప్పుడూ అదే పరిస్థితి ఉందని వాపోయాడు. వ్యవసాయానికి ఆటంకం లేకుండా 24 గంటలపాటు త్రీఫేజ్ విద్యుత్ సరఫరా చేయాలని కోరుతున్నాడు.

..ఇది ఈ ఒక్క రైతు ఆవేదన మాత్రమే కాదు. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ఈ యాసంగిలో వరి సాగు చేస్తున్న అన్నదాతలందరి దుస్థితి ఇదే. పెరిగిన విద్యుత్ వినియోగాన్ని కట్టడి చేసేందుకు వ్యవసాయానికి త్రీఫేజ్ కరెంట్ సరఫరాలో అమలు చేస్తున్న కోతలతో రైతులు పడుతున్న ఇక్కట్లపై 'సాక్షి' ఫోకస్..

– సాక్షి ప్రతినిధి, మహబూబ్‌నగర్

సాక్షి ఫోకస్

వ్యవసాయ విద్యుత్ కోతలతో ఇక్కట్లు



ధరూరు శివారులో నాటు వేస్తున్న రైతులు

- రోజుకు 9 నుంచి 11 గంటల సరఫరా
- ఉదయం నుంచి సాయంత్రం వరకే త్రీఫేజ్..
- అధిక లోడ్‌తో కాలిపోతున్న ట్రాన్స్‌ఫార్మర్లు
- పడిపోతున్న ఫీజులతో అంతరాయం
- సరఫరా సమయంలోనూ గంట వరకు అప్రకటిత బంద్
- వరినాట్ల సమయంలో రైతుల పరేషాన్

భారీగా పెరిగిన వినియోగం..

మహబూబ్‌నగర్ సర్కిల్ పరిధిలోని మహబూబ్‌నగర్, నారాయణపేట జిల్లాలో 2021 డిసెంబర్‌లో 6.07 మెగా యూనిట్లు విద్యుత్ వినియోగమైంది. అదే నెల 2022వ సంవత్సరంలో 7.95 మెగా యూనిట్ల విద్యుత్‌ను వినియోగించినట్లు అధికారిక రికార్డులు చెబుతున్నాయి. ఈ లెక్కన 1.88 మెగా యూనిట్ల విద్యుత్‌ను అధికంగా వినియోగించినట్లు స్పష్టమవుతోంది. ఇక్కడే కాదు.. విద్యుత్ డిమాండ్ రాష్ట్రవ్యాప్తంగా ఊహించిన దానికంటే పెరిగింది. ఐదు శాతం పెరుగుతుందని భావించినప్పటికీ.. సుమారు 10 నుంచి 15 శాతం వరకు వినియోగం పెరిగిందని ఆ శాఖ ఉన్నతాధికారుల అంచనా. ఈ క్రమంలో విద్యుత్ వినియోగాన్ని కట్టడి చేసేందుకు రాష్ట్రంలో గత డిసెంబర్ 18 నుంచి వ్యవసాయానికి త్రీఫేజ్ కరెంట్ సరఫరాలో కోతలు పెడుతున్నారు. సాగుకు 15 గంటలపాటు విద్యుత్ సరఫరా చేస్తున్నామని అధికారులు చెబుతున్నా.. పది నుంచి 12 గంటలకు మించి ఇవ్వడం లేదని క్షేత్రస్థాయిలో స్పష్టమవుతోంది.

వరి సాగుపై సందిగ్ధత

ఉమ్మడి పాలమూరు వ్యాప్తంగా ఎండాకాలంలో 9,25,508 ఎకరాల్లో వివిధ రకాల పంటలు సాగవుతాయని వ్యవసాయ శాఖ అధికారులు అంచనా వేశారు. ఇందులో ప్రధానంగా వరి 5,51,616 ఎకరాల్లో సాగు అయ్యే అవకాశం ఉంది. గతేడాది ఇదే సీజన్ చివరలో వరి చేతికందే సమయంలో నీరందకపోవడం.. ప్రస్తుతం వ్యవసాయానికి త్రీఫేజ్ కరెంట్ సరఫరాలో కోతలు అమలు చేస్తుండడంతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. ఈ నేపథ్యంలో వరి సాగుపై సందిగ్ధత నెలకొంది.

పోతున్నాయి. అంతేకాకుండా మధ్యాహ్నం 12 నుంచి రెండు మధ్యలో ఒక్కో రోజు ఒక్కోలా 15 నిమిషాల నుంచి గంట వరకు త్రీఫేజ్ విద్యుత్ సరఫరాలో అప్రకటిత కోతలు విధిస్తున్నారు. దీంతో వరి నాట్ల పనులు ముందుకుసాగడం లేదు. దీంతో పలు చోట్ల అన్నదాతలు ఆందోళనకు దిగుతున్నారు. ఇటీవల చిన్నచింతకుంట మండలంలో అమ్మాపూర్ గ్రామ రైతులు సబ్‌స్టేషన్ వద్ద ధర్నాకు దిగారు. అదేవిధంగా సోమవారం జోగుళాంబ గద్వాల జిల్లా గట్టు మండలకేంద్రంలో రైతులు సబ్‌స్టేషన్ వద్ద ఆందోళన చేపట్టారు.

కాలిపోతున్న ట్రాన్స్‌ఫార్మర్లు..

బోర్లు, చెరువులు, కుంటల్లో నీరు సమృద్ధిగా ఉండడంతో యాసంగి సీజన్‌లోనూ జిల్లాలో రైతులు ప్రధానంగా వరి సాగు చేస్తున్నారు. ఎక్కడ చూసినా నాట్లు ముమ్మరంగా సాగుతున్నాయి. అయితే వ్యవసాయానికి పగటిపూటే త్రీఫేజ్ కరెంట్ ఇస్తుండడం.. రైతులు ఒకే సమయంలో మోటార్లు ఆన్ చేస్తుండడంతో ట్రాన్స్‌ఫార్మర్లపై అదనపు లోడ్ పడుతోంది. ఈ క్రమంలో ఫీజులు పడిపోతుండడంతో పాటు పలు చోట్ల ట్రాన్స్‌ఫార్మర్లు కాలి

విద్యుత్ వినియోగం (మెగా యూనిట్లలో..)

జిల్లా	డిసెంబర్ 2021	డిసెంబర్ 2022	అధికం
మహబూబ్‌నగర్, నారాయణపేట	6.07	7.95	1.88
జోగులాంబ గద్వాల	2.85	3.85	0.93
నాగర్‌కర్నూల్	7.09	8.05	0.96
వనపర్తి	7.45	8.00	0.55

ఎండాకాలంలో పంటల సాగు (ఎకరాల్లో)..

జిల్లా	మొత్తంపంటల సాగు	సాగు కానున్న వరి (అంచనా)	ఇప్పటివరకు సాగైంది	కరిగెటపనులు
మహబూబ్‌నగర్	1,63,500	1,25,250	8,850	70,800
నారాయణపేట	1,87,000	1,35,000	165	68,000
నాగర్‌కర్నూల్	3,00,000	1,60,000	55,000	42,000
జోగులాంబ గద్వాల	1,25,000	50,000	5,000	40,000
వనపర్తి	1,50,008	81,366	184	35,000
మొత్తం	9,25,508	5,51,616	69,199	2,55,800

కోతలతో ఇబ్బందులు పడుతున్నాం



విద్యుత్ కోతల కారణంగా చాలా ఇబ్బందులు పడాల్సి వస్తోంది. ఎకరా విస్తీర్ణంలో మిరప, 2 ఎకరాల్లో వరి నాటు వేసుకున్నా. బోరుతో పాటుగా కాల్వ మోటార్ ద్వారా నీరు పారించుకుంటున్నాం. రాత్రి పూట విద్యుత్ పూర్తిగా నిలిపి వేసి, కేవలం పగలు మాత్రమే రఫరా చేస్తున్నారు. మధ్యలో చెప్పా పెట్టకుండా కోతలు పెడుతున్నారు. ఇలా అయితే పంటలు పండించుకోవడం కష్టం.

– మహదేవ్, రైతు, గట్టు

రాత్రి వేళల్లో సరఫరా చేయాలి



బోరు నీటి ఆధారంగానే సేద్యం చేసుకుంటున్నా. రాయాపురం శివారులో 4 ఎకరాల పొలం ఉంది. ఇందులో ఎకరా విస్తీర్ణంలో పోగాకు సాగు చేసుకున్నా. రెండు ఎకరాల్లో వరి నాటు వేయాల్సి ఉండగా విద్యుత్ కోతల కారణంగా నాటు ఇప్పటికి వేసుకోలే. విద్యుత్ సక్రమంగా ఉండడం లేదు. కోతలు పెడుతున్నారు. రాత్రి పూట విద్యుత్ సరఫరా చేస్తే బోరు నీటిని గుంతల్లోకి నింపుకుని ఉదయం ఆ నీటిని పంటలకు పారించుకునేందుకు వీలు ఉండేది. కరెంట్ కోతల కారణంగా యాసంగి పంటల సాగు కష్టమవుతోంది.

– గోపాల్, రైతు, రాయాపురం

ఇబ్బంది లేకుండా చూస్తున్నాం..



ప్రస్తుతం విద్యుత్ డిమాండ్ బాగా పెరిగింది. అయినా రైతులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా చూస్తున్నాం. వ్యవసాయానికి ఉదయం ఐదు నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు త్రీఫేజ్ విద్యుత్ సరఫరా చేస్తున్నాం. వారం తర్వాత మళ్లీ 24 గంటలపాటు ఇచ్చేలా ముందుకుసాగుతున్నాం.

– శ్రీరామ్మూర్తి, ట్రాన్స్‌కో ఎస్ఈ

24న మున్సిపల్ షాపులకు బహిరంగ వేలం

గద్వాల రూరల్: గద్వాల మున్సిపాలిటీ పరిధిలోని 73షాపులకు ఈనెల 24వ తేదీన బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు ఇన్‌చార్జ్ కమీషనర్ వెంకటరెడ్డి ప్రకటనలో తెలిపారు. వేలం పాటకు సంబంధించిన దరఖాస్తులను డిసెంబర్ 31వ తేదీ నుంచి ఈనెల 21వ తేదీ వరకు మున్సిపాలిటీలో అందజేస్తున్నట్లు తెలిపారు. దరఖాస్తులు తీసుకున్న వారు రూ.50 వేల ధరావత్తు, రూ.5లక్షల విలువ గల సాల్వేన్సి సర్టిఫికెట్లను తహసీల్దార్ ద్వారా పొంది వాటిని దరఖాస్తులకు జతపర్చి ఈనెల 21వ తేదీ సాయంత్రం 5గంటల వరకు ఇవ్వాలని తెలిపారు. దరఖాస్తు రుసుము రూ.1000 చెల్లించాలని పూర్తి వివరాలకు మున్సిపల్ కార్యాలయాన్ని సంప్రదించాలని పేర్కొన్నారు.

ఉచిత శిక్షణకు గడువు పొడిగింపు

గద్వాల రూరల్: ఎస్ఐ, పోలీసు కానిస్టేబుల్ దేహదారుఢ్య పరీక్షలో ఉత్తీర్ణులైన అభ్యర్థులకు మెయిన్స్‌కు సంబంధించి ఉచిత కోచింగ్ ఇవ్వనున్నట్లు, ఇందుకు దరఖాస్తుల గడువును సైతం ఈనెల 7వ తేదీ వరకు పెంచినట్లు బీసీ స్టడీసర్కిల్ డైరెక్టర్ ప్రవీణ్ ప్రకటనలో తెలిపారు. జిల్లా బీసీ స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో శిక్షణ ఇవ్వనున్నట్లు, ఆసక్తి గల అభ్యర్థులు దరఖాస్తులను ఈనెల 7వ తేదీలోగా మొదటి రైల్వే గేటు టీటీఎన్ బిల్డింగ్‌లో ఉన్న బీసీ స్టడీ సర్కిల్ కార్యాలయం ఇవ్వాలని, పూర్తి వివరాలకు 08546-293022, 9908560268 నంబర్లను సంప్రదించాలని తెలిపారు.

ఎంఎస్‌పీ ద్వారానే రాజ్యాధికారం సాధ్యం



అలంపూర్ చౌరస్తాలో ఎంఎస్‌పీ ఆవిర్భావ వేడుకల్లో నాయకులు

అలంపూర్: బడుగు, బలహీన వర్గాలు పాలకులు కావాలని, ఎంఎస్‌పీ ద్వారానే రాజ్యాధికారం సాధ్యమని మహాజన సోషలిస్టు పార్టీ(ఎంఎస్‌పీ) జాతీయ కార్యదర్శి కొంకల భీమన్న మాదిగ అన్నారు. అలంపూర్ చౌరస్తాలో మహాజన సోషలిస్టు పార్టీ నాల్గవ ఆవిర్భావ దినోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. జాతీయ కార్యదర్శి ముఖ్య అతిథిగా హాజరై ఎంఎస్‌పీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో వెలమ, రెడ్డి సామాజిక వర్గాల ఆధిపత్యంలోనే పార్టీలు ఏర్పాటై బడుగు, బలహీనవర్గాలు పాలితులుగా ఉన్నారన్నారు. ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ నేతృత్వంలోఎంఎస్‌పీ ఆవిర్భవించిందని, పాలితులుగా కాకుండా పాలకులుగా ఉండాలంటే రాష్ట్రంలోని మెజార్టీ వర్గాలకు ఒకే పార్టీ ఉండాలన్నారు. కార్యక్రమంలో జిల్లా ఇంచార్జీ రాజు మాదిగ, జిల్లా నాయకులు ఏలీషా మాదిగ, జయరాజు, వెంకటేశ్వర్లు, లక్ష్మి నారాయణ, ఏసేపు తదితరులు ఉన్నారు.

ప్రభుత్వ స్థలంపై కన్ను

- బండలు పాతి హద్దుల ఏర్పాటు



ముండ్లదిన్నెలోని ప్రభుత్వ స్థలంలో హద్దుల ఏర్పాటుకు పాతిన బండలు

రాజోళి: స్థలం ఖాళీగా ఉంటే చాలు కబ్జారాయుళ్లు వదలడం లేదు. అది ప్రభుత్వ భూమైనా సరే లెక్క లేకుండా ప్రహరీలు ఏర్పాటు చేసుకుని బాగాలు పంచేకుంటున్నారు. మండలంలోని ముండ్లదిన్నె గ్రామంలో ఇదే చోటుకుంది. గ్రామంలోని సర్వే నెంబర్ 147లో కొంత స్థలం కబ్జా కు గురవుతుందని, గత కొద్ది రోజులుగా గ్రామస్తులు అధికారులకు విన్నవిస్తూనే ఉన్నారు. దీనిపై అధికారులు నామమాత్రంగా చర్యలు తీసుకున్నారనే ఆరోపణలున్నాయి. అయితే గ్రామంలోని ప్రభుత్వ స్థలంలో నివాసం ఉండటమే కాకుండా, మరి కొందరు వాటిని అమ్ముకుని వ్యాపారం కూడా చేసినట్లు సమాచారం. దీనికి సంబంధించి గ్రామస్తులు అధికారులకు ఫిర్యాదు చేసినా, వారి నుంచి ఎలాంటి చర్యలు కనిపించకపోవడంతో, కబ్జాకారులు బుధవారం ఏకంగా ప్రభుత్వ స్థలంలోని 22 సెంట్లల్లో బండలు పాతుకుని హద్దులు ఏర్పాటు చేసుకున్నారు. దీంతో స్థానికులు కొందరు సోషల్ మీడియాలో పోస్టు చేశారు. గతంలో గ్రామస్తులు ఫిర్యాదు చేసినప్పటి నుంచి కొంత మౌనంగా ఉన్న వారు.. అధికారుల అలసత్వం కారణంగానే హద్దులు ఏర్పాటు చేసుకునే స్థితికి వచ్చారని గ్రామస్తులు అంటున్నారు. గ్రామంలోని కొందరి పెద్దల సహకారంతోనే ఈ కబ్జా జరుగుతుందని ఆరోపణలు జోరుగా వినిపిస్తున్నాయి. అధికారులకు ఫిర్యాదు అందిన వెంటనే ప్రభుత్వ స్థలానికి సంబందించిన బోర్డులు ఏర్పాటు చేసి కఠినమైన చర్యలు తీసుకుని ఉంటే ఇంతవరకు వచ్చేదికాదని, ఇప్పటికైనా ప్రభుత్వ స్థలంపై అధికారులు నిఘా ఉంచి కబ్జాకు గురి కాకుండా చూడాలని గ్రామస్తులు కోరుతున్నారు.

తహసీల్దార్‌ను వివరణ కోరగా..

ప్రభుత్వ స్థలంలో బండలు పాతిన విషయం తన దృష్టికి వచ్చిందనితహసీల్దార్ జోషి శ్రీనివాస్ శర్మ తెలిపారు. వెంటనే తన సిబ్బందిని పంపి వాటిని తొలగిస్తున్నట్లు, పంచాయతీ సెక్రటరీతో కూడా మాట్లాడి తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

కమ్యూనిటీ హాళ్ల నిర్మాణం త్వరగా పూర్తి చేయాలి

గద్వాల రూరల్: నియోజకవర్గ వ్యాప్తంగా మంజూరైన కమ్యూనిటీ హాళ్ల నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేయాలని ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి అన్నారు. బుధవారం తన క్యాంపు కార్యాలయంలో పంచాయతీరాజ్ శాఖ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ఏ నియోజకవర్గంలో లేనివిధంగా గద్వాల నియోజకవర్గానికి సీఎం కేసీఆర్ కమ్యూనిటీ హాళ్లకు ప్రత్యేక నిధులు కేటాయించారన్నారు. శంకుస్థాపనలు చేసిన వాటికి వెంటనే పనులు మొదలు పెట్టి త్వరతిగతిన పూర్తి చేయాలని, అదేవిధంగా స్థలాలు సేకరించని ప్రాంతాల్లో వెంటనే స్థల సేకరణ చేపట్టి పనులు మొదలు పెట్టాలన్నారు. సమావేశంలో పంచాయతీరాజ్ డీఈ రవీందర్, వివిధ మండలాల ఏఈలు, ఎంపీపీలు ప్రతాప్‌గౌడ్, విజయ్, జట్పీటీసీ రాజశేఖర్, తదితరులు పాల్గొన్నారు.



అధికారులతో సమీక్షిస్తున్న ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి

కల్తీ భయం..!

- కందనూలులో ఇద్దరి మృతికి కల్తీ మద్యమే కారణమని అనుమానాలు
- మద్యం దుకాణాలపై కరువైన అధికారుల పర్యవేక్షణ



నాగర్‌కర్నూల్‌లో ఓ వైన్ షాపునకు వచ్చిన లిక్కర్

సాక్షి, నాగర్‌కర్నూల్: జిల్లాలోని ఓ మద్యం దుకాణం నుంచి కొనుగోలు చేసిన మద్యం తాగి ఇద్దరు మృతిచెందడం కలకలం రేపింది. ఈ ఇరువురు కల్తీ మద్యం తాగడంతోనే మరణించారన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. దుకాణాలపై సంబంధిత అధికారుల పర్యవేక్షణ కరువైందన్న విమర్శలు విన్పిస్తున్నాయి. ప్రతి గ్రామంలో ఇబ్బడిముబ్బడిగా బెల్టుషాపులు వెలిశాయి. జిల్లావ్యాప్తంగా సుమారు 3వేలకు పైగా బెల్టు షాపుల్లో మద్యం విక్రయాలు సాగుతున్నట్లు తెలుస్తోంది. బెల్టు షాపులతో పాటు పలు వైన్‌షాపుల్లో కల్తీ మద్యాన్ని విక్రయిస్తున్నారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఇటీవల రంగారెడ్డి జిల్లా హయత్‌నగర్‌లో ఎక్సైజ్, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు జరిపిన సోదాల్లో రూ. 3కోట్ల విలువ చేసే నకిలీ మద్యాన్ని పట్టుకున్నారు. ఒరిజినల్ బాటిళ్లలో నకిలీ మద్యం నింపి స్టిక్కర్లు వేసి విక్రయించినట్లు అధికారులు గుర్తించారు. ఒడిశాలోని కటక్ ప్రాంతంతో పాటు ఛత్తీస్‌గడ్ రాష్ట్రం నుంచి నకిలీ మద్యం వచ్చినట్టు నిర్ధారించారు. నల్లగొండ జిల్లాలోనిడో వైన్‌షాపులోనూ నకిలీ మద్యాన్ని అమ్మినట్లుగా గుర్తించి కేసులు నమోదుచేశారు. కానీ జిల్లా ఎక్సైజ్ అధికారులు మాత్రం వైన్‌షాపులకు నకిలీ మద్యం చేరే అవకాశమే లేదని చెబుతున్నారు. జిల్లాకేంద్రంలో పలుకుబడి ఉన్న నేత ఒక్కరే నాలుగైదు వైన్‌షాపులు దక్కించుకొని వ్యవస్థీకృతంగా దందా సాగిస్తున్నారన్న ఆరోపణలున్నాయి.

గద్వాల నుంచి అధికంగా డంపింగ్

ఉమ్మడి పాలమూరు జిల్లావ్యాప్తంగా తరచుగా కల్తీ మద్యం నిల్వలు లభిస్తున్న ఘటనలు చోటుచేసుకుంటున్నాయి. కర్ణాటక, గోవా రాష్ట్రాల నుంచి పెద్ద ఎత్తున మద్యం సరఫరా అవుతోంది. బెల్టు షాపుల ద్వారా ఇతర రాష్ట్రాల మద్యం అమ్ముడవుతోంది. జోగుళాంబ గద్వాల జిల్లాలోని గట్టు, కేటీదొడ్డి, అయిజ, వడ్డేపల్లి, అలంపూర్ మండలాల్లో ఎక్కువగా కల్తీ మద్యం డంపింగ్ అవుతుండగా ఇక్కడికి సరఫరా అవుతుందన్న ఆరోపణలున్నాయి. ఇప్పటికే గద్వాల జిల్లా కేటీదొడ్డి మండలంలో స్థానికంగా మద్యం తయారు చేస్తున్న వైనాన్ని అధికారులు గుర్తించి కేసులు నమోదు చేశారు. స్పిరిట్‌తో పాటు కొన్ని రకాల రంగులను కలిపి లిక్కర్‌ను తయారు చేస్తుండగా, వాటిలో స్పిరిట్ శాతం పెరిగితే ప్రమాదకరంగా మారుతోంది.

రిపోర్టు వారంలో వస్తుంది

జిల్లాలోని వైన్‌షాపులకు డిపో నుంచి మాత్రమే సరఫరా అవుతాయి. దీంతో కల్తీకి అవకాశం ఉండదు. జిల్లాకు సరిపడా లిక్కర్ అందుబాటులో ఉంది. బయటి నుంచి వచ్చే అవకాశం లేదు. బస్టాండ్ సమీపంలోని మోతీ వైన్స్ నుంచి మద్యం శాంపిళ్లను సేకరించాం. మరో వారం రోజుల్లో శాంపిల్ రిపోర్టు వచ్చే అవకాశం ఉంది.

– ఫయాజుద్దీన్, ఎక్సైజ్ సూపరింటెండెంట్, నాగర్‌కర్నూల్



దివ్యాంగులు ఆత్మస్థైర్యంతో ముందుకు సాగాలి

గద్వాల అర్బన్: దివ్యాంగులు ఆత్మస్థైర్యంతో ముందుకు సాగాలని, విద్యార్థులు లూయిస్ బ్రెయిలీ రూపొందించిన లిపి ద్వారా మంచిగా చదువుకొని ఉన్నత స్థాయికి ఎదగాలని డీడబ్ల్యూఓ ముషాయిదా బేగం అన్నారు. జిల్లా కేంద్రంలో రాఘవేంద్ర కాలనీలోని అంధుల ఆశ్రమ పాఠశాలలో ప్రభుత్వపరంగా మహిళా, శిశు, దివ్యాంగుల, వయోవృద్దుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో బుధవారం లూయిస్ బ్రెయిలీ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ముషాయిదా బేగం మాట్లాడుతూ.. లూయిస్ బ్రెయిలీ అంగ వైకల్యాన్ని జయించి అనుకున్న లక్ష్యాన్ని సాధించిన మహనీయుడని కొనియాడారు. ఆయనే అంధుల విద్యా ప్రధాత అని, ఎంతో మంది అంధులను విద్యావేత్తలుగా, శాస్త్రవేత్తలుగా, సంగీత కళాకారులుగా, చిత్రకారులుగా, అనేక రంగాల్లో బ్రెయిలీ లిపితో అగ్రభాగన నిలిపిన వ్యక్తి అని అన్నారు. అనంతరం కేక్‌కట్ చేసి లూయిస్ బ్రెయిలీ జన్మదిన వేడుకలను జరుపుకొన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ రంగన్న, పూర్వ విద్యార్థులు నాగర్జున చారి, సతీష్ రెడ్డి, బడేసాబ్, బీచుపల్లి, శ్రవణ్, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడికి సన్మానం

జిల్లా కేంద్రంలో జమ్మిచేడులోని ప్రాథమిక పాఠశాలలో ఎస్జీటీ ఉపాధ్యాయుడిగా పని చేస్తున్న మౌలాలి పాషను తోటి ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పాఠశాల హెచ్.ఎం నాగమణి మాట్లాడుతూ మౌలాలి లూయిస్ బ్రెయిలీ రూపొందించిన లిపితో చదువుకొని ఉపాధ్యాయుడిగా పని చేస్తున్నారన్నారు.

క్లుప్తంగా

డీసీఎంను ఢీ కొట్టిన లారీ

● ఒకరి మృతి, ఇద్దరికి గాయాలు

దేవరకద్ర: మండల కేంద్రంలోని పెద్ద చెరువు సమీపంలో ఉన్న పెట్రోల్ బంకు వద్ద ఆగి ఉన్న డీసీఎంను వెనుక నుండి లారీ ఢీకొట్టింది. పోలీసుల తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. బుధవారం తెల్లవారుజామున కొత్తూర్ నుంచి కర్ణాటకలోని యాద్గీర్‌కు వెళ్తున్న డీసీఎంను రోడ్డు పక్కన ఆపి డ్రైవర్ నిద్రిస్తుండగా వెనుక నుంచి లారీ ఢీకొట్టింది. ఈ సంఘటనలో లారీలో ఉన్న ముగ్గురు వ్యక్తులు గాయపడ్డారు. వారిని చికిత్స నిమిత్తం జిల్లా ఆస్పత్రిలో తరలించారు. డ్రైవర్ శామ్యూల్‌కు మెరుగైన చికిత్స కోసం స్వస్థలం విజయవాడ తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడని ఎస్ఐ భగవంతరెడ్డి తెలిపారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

కూలీ పనులకు వచ్చి మహిళ మృతి

కోస్గి: దినసరి కూలీగా పని చేసుకుని జీవనం గడుపుతున్న మహిళ అకస్మాత్తుగా కిందపడి అక్కడికక్కడే మృతి చెందిన సంఘటన పట్టణంలో బుధవారం రాత్రి చోటు చేసుకుంది. గుండుమాల్ మండల కేంద్రానికి చెందిన మాలెకడి మొగులమ్మ(40)ను భర్త వదిలేయడంతో తన తల్లితో కలిసి గ్రామంలోనే ఉంటుంది. రోజు కోస్గికి వచ్చి అడ్డ కూలీగా పని చేస్తూ జీవనం సాగిస్తుంది. ఈ క్రమంలో బుధవారం పనులు ముగించుకొని స్వగ్రామానికి వెళ్లేందుకు బస్టాండ్‌కు వెళ్తున్న క్రమంలో నడుచుకుంటూనే అకస్మాత్తుగా ఓ కిరాణ దుకాణం వద్ద పడిపోయింది. తాగి పడిపోయిందనుకొని ఎవరూ పట్టించుకోకుండా వెళ్లిపోయారు. చాలా సమయం కావడంతోపాటు కదలకుండా పడి ఉన్న మహిళను చూసి కొందరు 108కి సమాచారం ఇచ్చారు. స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. సంఘటనపై ఎలాంటి ఫిర్యాదు అందలేదని, వివరాలు సేకరించి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శ్రీనివాసులు తెలిపారు.

చికిత్స పొందుతూ వ్యక్తి..


నాగన్న యాదవ్ (ఫైల్)

అడ్డాకుల: మండల కేంద్రానికి చెందిన బి.నాగన్న యాదవ్ (45) ఆర్థిక ఇబ్బందులతో ఆత్మహత్యకు పాల్పడి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఎస్ఐ విజయకుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. నాగన్న యాదవ్, కొండమ్మ దంపతులు. వీరికి కుమారుడు, కుమార్తె ఉన్నారు. వ్యవసాయంతో పాటు కూలీ పనులు చేసేవాడు. ఆరేళ్ల కిందట రోడ్డు ప్రమాదానికి గురై నాగన్న ఆర్థికంగా చితికిపోయాడు. ఈ క్రమంలో జీవితంపై విరక్తి చెంది డిసెంబర్ 30న పురుగు మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ బుధవారం తెల్లవారుజామున మృతి చెందాడు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

ఉరేసుకుని యువకుడు ఆత్మహత్య

నారాయణపేట రూరల్: ఉరేసుకుని విద్యార్థి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన జిల్లా కేంద్రంలో చోటు చేసుకుంది. పట్టణంలోని గాంధీ నగర్‌కు చెందిన బందిగి నవీన్ (24) ఓ కళాశాలలో విద్యను అభ్యసిస్తున్నాడు. కొంత కాలంగా తీవ్ర అనారోగ్యంతో బాధ పడుతున్నాడు. ఆస్పత్రిలో చూయించినా తగ్గకపోవడంతో నిరాశకు గురయ్యాడు, జీవితంపై విరక్తి చెందిన అతడు మంగళవారం సాయంత్రం ఇంట్లో ఎవరూ లేని సమయంలో తాడుతో ఉరి వేసుకున్నాడు. ఆలస్యంగా ఇంటికి వచ్చిన కుటుంబ సభ్యులు గమనించి ఆస్పత్రికి తీసుకెళ్లగా అప్పటికే మృతి చెందాడని డాక్టర్లు తెలిపారు. బుధవారం మృతుడి తండ్రి బందిగి శంకర్ ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సురేష్ తెలిపారు.

రైలు కిందిపడి వ్యక్తి..

మహబూబ్‌నగర్ క్రైం: వేగంగా వెళ్తున్న రైలు కిందపడి వ్యక్తి బలవన్మరణానికి పాల్పడ్డాడు. రైల్వే ఎస్ఐ అక్బర్ తెలిపిన వివరాల ప్రకారం.. జిల్లా కేంద్రంలోని అప్పన్నపల్లికి చెందిన మహ్మద్ ఎజాస్(32) బుధవారం సాయంత్రం అప్పన్నపల్లి బ్రిడ్జి కింద కాచిగూడ ప్యాసింజర్ రైలు వస్తున్న క్రమంలో పట్టాలపై కూర్చుని రైలు కిందపడ్డాడు. మృతుడికి కొన్ని రోజులుగా ఆరోగ్య సమస్యలు వేధించడంతో పాటు మద్యం అలవాటు ఉండటం వల్ల మనస్తాపం చెంది ఆత్మహత్య చేసుకున్నట్లు తెలిపారు. మృతుడికి ముగ్గురు పిల్లలు, భార్య ఉన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

హైదరాబాద్ మెట్రోస్టేషన్‌లో..

మక్తల్: మండలానికి చెందిన ఓ వృద్ధురాలు హైదరాబాద్‌లో ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే.. మండలంలోని కాచ్‌వార్ చెందిన మరియమ్మ (68) వారం రోజుల క్రితం తన కూతురు సావిత్రమ్మ కాన్పు ఉందని హైదరాబాద్ వెళ్లింది. అయితే కాన్పు పూర్తయి వారం రోజులు కావడంతో మరియమ్మ స్వగ్రామానికి వెళ్తానని తెలుపగా అల్లుడు నర్సింహులు మరుసటి వెళ్లాలని తెలిపాడు. అయితే కొద్దిసేపు తర్వాత ఆమె కనిపించకుండా పోయింది. ఆమెను వెతుక్కుంటూ వెళ్లగా మంగళవారం రాత్రి ఎర్రగడ్డ మెట్రో స్టేషన్ నుంచిపై దూకి ఆత్మహత్య చేసుకున్నదని కుటుంబ సభ్యులు తెలిపారు. ఆమెకు మతిస్థిమితం సక్రమంగా లేదని తెలిపారు. హైదరాబాద్‌లోని గాంధీ ఆస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించి బుధవారం రాత్రి మృతదేహాన్ని కాచ్‌వార్ గ్రామానికి తీసుకొచ్చారు. కాగా మృతురాలికి కుమారుడు, ఇద్దరు కూతుర్లు ఉన్నారు.

అర్చక పరీక్షలకు సర్వం సిద్ధం


పరీక్షకు హాజరైన అర్చకులు (ఫైల్)

● హాజరు కానున్న 359 మంది అభ్యర్థులు
● 12 ఏళ్ల తర్వాత పరీక్షలు

జోగుళాంబ శక్తిపీఠం: దేవాదాయ ధర్మాదాయ శాఖ తరఫున ప్రవేశ, వర, ప్రవర వంటి అర్చక పరీక్షలను ఈ నెల 6, 7వ తేదీలలో నిర్వహిస్తున్నారు. కాగా ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా నుంచి 359 మంది పరీక్షలు రాసేందుకు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు చేసుకున్నట్టు ఉమ్మడి జిల్లా అసిస్టెంట్ కమిషనర్ శ్రీనివాస్‌రాజు తెలిపారు. పరీక్ష కేంద్రాన్ని మహబూబ్‌నగర్‌లోని లక్ష్మీనరసింహ స్వామి ఆలయం వద్ద గల కల్యాణమండపంలో నిర్వహిస్తున్నట్టు తెలిపారు. 2012 తరువాత ఈ పరీక్షలను దేవదాయశాఖ మళ్లీ చేపట్టడంతో అభ్యర్థులు పెద్ద ఎత్తున దరఖాస్తు చేసుకున్నారు. పరీక్షలు పకడ్బందీగా నిర్వహించేదుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్టు పరీక్ష నోడల్ ఆఫీసర్ శ్రీనివాస్‌రాజు తెలిపారు. పాంచరాత్రం, వైష్ణవ, స్మార్థ, గ్రామాచారం, వీరశైవ ఆగమాలకు సంబంధించి ఈ పరీక్షలు నిర్వహిస్తున్నట్టు పేర్కొన్నారు. ఇదిలా ఉండగా అర్చక పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థులంతా పరీక్ష కేంద్రంలోకి సాంప్రదాయ దుస్తులతో హాజరుకావాలి.. 40 ఏళ్ల వయసు పైబడిన వారికి రాత పరీక్ష లేకుండా, కేవలం మౌఖిక పరీక్ష మాత్రమే ఉంటుంది. మొదటి పేపర్ ఉదయం 9:30 నుంచి మధ్యాహ్నం 12:30గంటల దాక, పేపర్–2 మధ్యాహ్నం 2గంటల నుంచి 5 గంటల వరకు ఉంటుంది. 7తేదీ ఉదయం 9:30 గంటల నుంచి 12:30 గంటలకు వరకు పేపర్–3, మధ్యాహ్నం 2గంటల నుంచి 5 గంటల వరకు ఓరల్ ఎగ్జామ్ ఉంటుంది. పరీక్షలకు వివిధ ప్రాంతాల నుంచి వచ్చే వారి కోసం ఉచితంగా రెండు రోజుల పాటు భోజన సౌకర్యాన్ని కల్పించనున్నారు. పరీక్షల నిర్వహణ కోసం17 మంది ఇన్విజిలేటర్లు, ముగ్గురు సూపర్‌వైజింగ్ ఆఫీసర్లు, నోడల్ అధికారి ఉంటారు. ఉత్తీర్ణులైన వారికి పదోన్నతులలో ప్రాధాన్యం, అలాగే స్పెషల్ గ్రేడ్ ఇంక్రిమెంట్లకు ఆస్కారం ఉంటుంది.

ప్రభుత్వంపై ఒత్తిడితోనే నోటిఫికేషన్



చాలా కాలం తర్వాత మళ్లీ పరీక్షలు నిర్వహించడం శుభపరిణామం. అర్చక, ఉద్యోగ సంఘాల నుంచి ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి నోటిఫికేషన్ విడుదల చేయించాం. మాస్ కాపీయింగ్‌కు పాల్పడకుండా అందరు నిజాయితీగా పరీక్షలు రాయాలి.

– జయపాల్‌రెడ్డి, జిల్లా అర్చక ఉద్యోగ జేఏసీ కన్వీనర్

ఎలాంటి భయం వద్దు



పరీక్షరాసే వారిలో ఎలాంటి భయం ఆందోళన వద్దు. ప్రతి రోజు చేసే పూజలకు సంబంధించిన అంశాలపైనే పరీక్ష ఉంటుంది. జాతక భాగం, పంచాగంపై కొంత పూజా, ఉత్సవాది కార్యక్రమాలలో అపచారాలకు చేయాల్సిన ప్రాయశ్చితం పై అవగాహన పెంచుకుని పరీక్షలకు సిద్ధంకండి.

– ఆనంద్ శర్మ, జిల్లా అర్చక సంఘం అధ్యక్షుడు

పకడ్బందీగా పరీక్షలు



ఈ నెల 6, 7వ తేదీలలో నిర్వహించే అర్చక పరీక్షలు పకడ్బందీగా నిర్వహించేందుకు దేవదాయశాఖ ఆధ్వర్యంలో అన్ని ఏర్పాట్లు చేశాం. భోజన సౌకర్యం కూడా కల్పిస్తున్నాం. తాగునీరు, ప్రాథమిక వైద్యం, పోలీస్ భద్రతపై చర్యలు తీసుకుంటున్నాం.

– శ్రీనివాస్‌రాజు, అర్చక పరీక్షల నోడల్ ఆఫీసర్

సహకార సిబ్బందిపై ఆగ్రహం

● రుణ పంపిణీపై పూర్తిస్థాయి విచారణ
● అక్రమాలు తేలితే కఠిన చర్యలు
● డీసీఓ సుధాకర్


సహకార సంఘంలో ఫైళ్లను పరిశీలిస్తున్న డీసీఓ సుధాకర్

గండేడ్: ప్రాథమిక సహకార సంఘంలో అవినీతిపై సాక్షి దినపత్రిలో వచ్చిన కథనంపై జిల్లా అధికారులు స్పందించారు. బుధవారం డీసీఓ సుధాకర్ ప్రాథమిక సహకార సంఘం కార్యాలయంలో తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన సిబ్బందిపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. చనిపోయిన వారికి రుణాలు ఎలా ఇస్తారని ఆయన ప్రశ్నించారు. క్రాప్, ఎల్‌టీ లోన్లు ఎన్ని ఇచ్చారు, ఎవరెవరికి ఇచ్చారన్న విషయాలపై ఆరా తీశారు. రెడ్డిపల్లికి చెందిన పలువురు బాధితులను పిలిపించి వివరాలు సేకరించారు. తమ తండ్రులు చనిపోయిన రెండు, మూడేళ్లకు రుణాలు తీసుకున్నట్లు రికార్డుల్లో చూపారని వారు తెలిపారు. అయితే సిబ్బంది అది పాత జాబితా అని, వారు గతంలో ఎల్‌టీ లోను తీసుకుని చనిపోవడంతో క్రాప్ లోన్ ద్వారా వారి కిస్తులు సర్దుబాటు చేసినట్లు తెలిపారు. ముందుగా రుణాలు బాకీ ఉన్న జాబితా తయారుచేసి పంచాయతీల వద్ద ప్రచురించాలని ఆయన సీఈఓ ఆశన్నకు ఆదేశించారు. మొత్తం రుణాలపై విచారణ చేపట్టనున్నట్లు తెలిపారు. అక్రమాలు తేలితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సిబ్బంది నిర్లక్ష్యం కారణంగా ఇలాంటి సమస్యలు తలెత్తినట్లు తెలిపారు. ఆయన వెంట డీసీసీబీ చైర్మన్ ఆజనేయులు, ఆడిటర్ రఫీయోద్దీన్ తదితరులు ఉన్నారు.

ఆపరేషన్ స్మైల్ బృందం దాడులు


పోలీసుల అదుపులో బాలకార్మికులు

నారాయణపేట రూరల్: పట్టణంలోని బుధవారం ఆపరేషన్ స్మైల్ బృందాలు విస్తృత దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా మెకానిక్‌షాప్, హోటళ్లు, వెల్డింగ్ దుకాణాలు, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లు తదితర చోట్ల పనిచేస్తున్న 12మంది బాలకార్మికులను గుర్తించారు. వారిని సీడబ్ల్యూసీ కార్యాలయంలో అప్పగించారు. తదుపరి పిల్లలు, వారి తల్లిదండ్రులు చైల్డ్ వెల్ఫేర్ కమిటీ ఎదుట హాజరుపర్చి కౌన్సెలింగ్ ఇవ్వనున్నట్లు పోలీసులు తెలిపారు. దుకాణ యజమానులను జరిమానా విధిస్తామని చెప్పారు. ఎక్కడైన బాలకార్మికులు కనిపిస్తే 100కు కాల్ చేసి తెలియజేయాలని పేర్కొన్నారు.

ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన వీఆర్‌ఏ

గండేడ్: మండల కేంద్రానికి చెందిన వీఆర్‌ఏ ఉద్యోగం తొలగిపోతుందోమోనని విషం తాగి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన చోటుచేసుకుంది. ఇందుకు సంబంధించి స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గండేడ్ మండల కేంద్రానికి చెందిన గొల్ల అనంతయ్య గ్రామంలో ఊటబంది నిబంధనల ద్వారా వీఆర్‌ఏ (కావలికారు)గా పని చేస్తున్నాడు. ఇదే తరుణంలో వీఆర్‌ఏ పట్టాదారుకు ఒక్కరికే ఉద్యగం ఉంటుందని, మిగిలిన వారికి ఊటబంది నిబంధన వర్తించదని తెలుపడంతో ఆవేదనకు లోనైన అనంతయ్య బుధవారం పురుగుల మందు తాగాడు. గమనించిన స్థానికులు మహబూబ్‌నగర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. బాధితుడి పరిస్థితి విషమంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు.

ఆస్పత్రి ఆవరణలో నవజాత శిశువు లభ్యం

● తల్లిని గుర్తించి చికిత్స అందిస్తున్న వైద్య సిబ్బంది


శిశువుకు ఎస్ఎన్‌సీయూలో చికిత్స అందిస్తున్న వైద్య సిబ్బంది

పాలమూరు: జిల్లా జనరల్ ఆస్పత్రిలో నవజాత శిశువు లభించడం కలకలం సృష్టించింది. వివరాల్లోకి వెళితే.. మిడ్జిల్ మండలంలోని ఓ గ్రామానికి చెందిన గర్భిణి ప్రసవం కోసం ఒంటరిగా బుధవారం ఉదయం ఆస్పత్రికి వచ్చింది. అప్పటికే ఆమెకు నొప్పులు రావడంతో మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి ఆవరణలో ఉన్న టీ–హాట్, టాయిలెట్స్ మధ్యలో సాధారణ ప్రసవం ద్వారా మగ శిశువుకు జన్మనిచ్చింది. తర్వాత శిశువును అక్కడే వదిలేసి వెళ్లిపోయింది. శిశువు శరీర భాగాలకు పూర్తిగా రక్తంతో ఉండి ఏడుస్తుంటే గమనించిన ఆస్పత్రి సెక్యూరిటీ సిబ్బంది వైద్యాధికారులకు సమాచారం ఇచ్చారు. శిశువును అక్కడి నుంచి ఆస్పత్రిలోని ఎస్ఎన్‌సీయూకు తరలించి ప్రాథమిక చికిత్స అందించారు. ప్రసవం అయిన బాలింత మానసిక పరిస్థితి సక్రమంగా లేకపోవడంతో శిశువును వదిలేసి వేరే చోటకు వెళ్లింది. ఆస్పత్రి సిబ్బంది ఆమెను గుర్తించి ప్రస్తుతం చికిత్స అందిస్తున్నారు. అయితే బాలింతకు హెచ్ఐవీ పాజిటివ్ ఉన్నట్లు సమాచారం. రెండు నెలల కిందట నుంచి మందులు వాడుతున్నట్లు తెలిసింది. అప్పటికే ఆమెకు ఇద్దరు పిల్లలు ఉండగా భర్త ఇటీవలే వదిలిపెట్టినట్లు సమాచారం. ప్రస్తుతం శిశువు ఆరోగ్యానికి ఎలాంటి ఇబ్బంది లేదని, చికిత్స అందిస్తున్నామని, బాలింతను కూడా చికిత్స అందిస్తున్నామని ఆరోగ్యం నిలకడగా ఉందని ఆస్పత్రి ఆర్ఎంఓ సిరాజుద్దీన్, గైనిక్ హెచ్ఓడీ రాధ వెల్లడించారు.

బాలిక ప్రసవం: కేసు నమోదు

పాలమూరు: జిల్లా కేంద్రంలోని ఓ ఆస్పత్రిలో బాలిక ప్రసవించింది. జడ్చర్ల ప్రాంతానికి చెందిన ఓ బాలిక పెళ్లి కాకుండా గర్భం దాల్చింది. 17 రోజుల కిందట మహబూబ్‌నగర్ పట్టణంలో ఓ ఆస్పత్రిలో ప్రసవమైంది. దీనిపై జడ్చర్ల పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు కావడంతో పాటు సీడబ్ల్యూసీ సిబ్బంది బాలిక పరిస్థితిపై పర్యవేక్షణ చేస్తున్నారు.

అనిరుధ్‌రెడ్డి కార్యాలయంలో ఐటీదాడులు

జడ్చర్ల: టీపీసీసీ ప్రధాన కార్యదర్శి జనంపల్లి అనిరుధ్‌రెడ్డికి చెందిన హైదరాబాద్ కార్యాలయంలో బుధవారం ఐటీదాడులు కావడంతో నియోజకవర్గంలో కలకలంరేగింది. తెల్లవారుజామునే అధికారులు కార్యాలయంలో సోదాలు ప్రారంభించినట్లు సమాచారం. దాడులతో నియోజకవర్గంలో పార్టీ నాయకులు, కార్యకర్తల్లో ఆందోళన నెలకొంది. ఆయన సన్నిహితుల ఖాతాలపై ఐటీ అధికారులు నిఘా పెట్టినట్లు సమాచారం. స్వగ్రామం రంగారెడ్డిగూడలోనూ ఐటీదాడులు జరుగుతాయని ఊహించినా అలాంటిదిమి కాలేదు.

నిప్పంటుకుని చెరుకు పంట దగ్ధం


కాలిన చెరుకు పంట

గద్వాల రూరల్: ప్రమాదవశత్తు నిప్పంటుకుని పూర్తిగా చెరుకు పంట దగ్ధమైన ఘటన బుధవారం మండలంలో చోటు చేసుకుంది. బాధిత రైతు చంద్రశేఖర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని వీరాపురం శివారులో 14ఎకరాల పొలాన్ని కౌలుకు తీసుకుని చెరుకు పంటను సాగుచేశాడు. పంట చేతికొచ్చే సమయంలో పొలం పక్కనున్న రైతు చెత్తను కాల్చివేశారు. ఈక్రమంలో మంటల నుంచి నిప్పురవ్వలు చెరుకుపంటపై ఎగసి పడ్డాయి. దీంతో ఒక్కసారిగా మంటలు ఎగసిపడి పంటమొత్తం విస్తరించాయి. విషయం గమనించిన రైతు అగ్నిమాపక శాఖ అధికారులకు సమాచారం అందించారు. అదేవిధంగా తోటిరైతులతో కలిసి మంటలు ఆర్పే ప్రయత్నం చేశారు. ఫైరింజన్ ప్రమాదస్థలానికి చేరుకుని మంటలు ఆర్పే ప్రయత్నం చేసినప్పటికీ ఫలితంగా లేకుండా పోయింది. దీంతో సుమారు రూ.20లక్షల వరకు పంటనష్టం వాటిల్లినట్లు రైతు తెలిపారు.

విద్యుత్ చౌర్యం కేసులో రిమాండ్

గట్టు: విద్యుత్ చౌర్యం చేస్తూ పట్టుబడిన వ్యక్తిని బుధవారం గద్వాల కోర్టులో హాజరుపరచగా రిమాండ్‌కు తరలించినట్లు విద్యుత్ విజిలెన్స్ సీఐ కాశిరెడ్డి, ఎస్ఐ అంజయ్య తెలిపారు. మహబూబ్‌నగర్ విద్యుత్ విజిలెన్స్ సీఐ, ఎస్ఐ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని రాయాపురం చెందిన కొరి రాముడు తన ఇంటికి అక్రమంగా విద్యుత్‌ను వాడుకుంటున్న తరుణంలో విద్యుత్ విజిలెన్స్ అధికారుల గతేడాది సెప్టెంబర్‌లో తనిఖీ నిర్వహించగా పట్టుబడినట్లు తెలిపారు. మొదటి తప్పుగా భావించి జరిమానా విధించి వదిలేశారు. అయితే ఈయన మళ్లీ అదే పనిగా తన ఇంటికి అక్రమంగా విద్యుత్‌ను వాడుకుంటున్న క్రమంలో డిసెంబర్ నెలలో పట్టుబడినట్లు తెలిపారు. విజిలెన్స్ అధికారులు మహబూబ్‌నగర్ ట్రాన్స్‌కో విజిలెన్స్ పోలీస్‌స్టేషన్‌లో కొరి రాముడిపై ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకున్నట్లు సీఐ తెలిపారు. ఆయనను గద్వాల కోర్టులో హాజరుపరచగా రిమాండ్‌కు తరలించినట్లు సీఐ, ఎస్ఐలు తెలిపారు.

వంట చేస్తుండగా గ్యాస్ లీకై మంటలు

● ముగ్గురికి గాయాలు

హన్వాడ: సిలిండర్‌లో మంటలు చెలరేగి వ్యక్తులకు గాయాలైన సంఘటన మండలంలోని కొనగట్టుపల్లిలో బుధవారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన జాము అమృతమ్మ, అత్త జాము అనంతమ్మ తమ ఇంట్లో వంట చేస్తున్నారు. ఈ క్రమంలో సిలిండర్ పైపు లీకై రెగ్యులేటర్ వద్ద మంటలు చెలరేగాయి. దీంతో వంట చేస్తున్న వారిద్దరికి గాయాలయ్యాయి. అరుపులు విన్న అమృత భర్త జాము శ్రీనివాసులు లిండర్‌ను ఇంట్లోంచి బయటికి తెచ్చి దూరంగా వేశాడు. ఈ క్రమంలో అతనికి కూడా గాయాలయ్యాయి. అనంతమ్మకు తీవ్ర గాయాలు కాగా, ముగ్గురిని జిల్లాకేంద్రంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

జోరుగా ఇసుక అక్రమ రవాణా?

● సుద్దకల్ శివారులో భారీగా నిల్వలు


పట్టుబడిన ఇసుక ట్రాక్టర్ (ఫైల్)

కల్వకుర్తి రూరల్: ఇసుక అక్రమ రవాణకు అడ్డుకట్ట లేకుండా పోయింది. అక్రమార్కులు అధికారుల చేతులు తడుపుతూ తమ పని కానిచ్చేస్తున్నారు. మండలంలోని వాగులో సుద్దకల్, ఎల్లికల్, యంగంపల్లి, సదగోడ్, చింతపల్లి నుంచి అక్రమ రవాణా జోరుగా కొనసాగుతుంది. ప్రతి రోజు వందల సంఖ్యలో ట్రాక్టర్ల ద్వారా వాగులను తోడేస్తున్నారు.

రాత్రివేళ డంపులు

మండలంలోని సుద్దకల్‌లో దాదాపు 50 ట్రాక్టర్ల ద్వారా ఇసుక అక్రమ రవాణా సాగుతుంది. అప్పుడప్పుడు దాడులు చేశారనే రీతిలో వ్యవహారం నడుస్తుండడంతో రవాణాకు అడ్డు లేకుండా పోయింది. ట్రాక్టర్ల ద్వారా ఇసుకను సమీప పొలాల్లో, మైదాన ప్రాంతాల్లో నిల్వ చేస్తున్నారు. మరికొందరు అర్ధ రాత్రి 2గంటల నుంచి 4గంటల వరకు కల్వకుర్తికి తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. మండలంలోని రఘుపతిపేట, నడిగడ్డకు సమీపంలో ఇసుకను అచ్చంపేట నియోజకవర్గం బల్మూరు మండలం నుంచి వచ్చి ఇసుకను తోడేస్తున్నారు. మండలంలోని సుద్దకల్‌లో ఇసుక వ్యాపారిగా చలామణి అయిన ఒకరు టిప్పర్ల ద్వారా ఇసుకను అక్రమంగా తరలిస్తున్నారని సమాచారం. ప్రతి రోజు 5 టిప్పర్ల ద్వారా ఇసుకను తరలిస్తున్నారు.

అడ్డు, అదుపు లేకుండా?

అడ్డు, అదుపు లేకుండా ఇసుకను తరలిస్తున్నా ఆపేవారు కరువయ్యారని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల సమావేశంలో ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణరెడ్డి ఇసుక అక్రమ రవాణాను ప్రస్తావించారు. ప్రభుత్వానికి చెడ్డపేరు వస్తున్నా అధికారులు ఇసుక మాఫియాకు అండగా నిలవడం పై ఎమ్మెల్సీ ఆగ్రహం వ్యక్తం చేశారు.

చర్యలు తీసుకుంటాం

మండలంలోని సుద్దకల్ వాగు నుంచి ట్రాక్టర్లు, టిప్పర్ల ద్వారా ఇసుకను అక్రమంగా తరలిస్తే చర్యలు తీసుకుంటాం. చీకటి సమయాల్లో అక్రమ రవాణా చేస్తున్నారని, దీంతో కొన్ని సమస్యలు వస్తున్నాయని తెలిపారు.

– రాంరెడ్డి, తహసీల్దార్, కల్వకుర్తి

అలసంద సాగుతో లాభాలు


అలసంద పంట సాగు

పాడి–పంట
అధికారి సలహా: సక్రియనాయక్, ఏడీఏ, అలంపూర్

అలంపూర్: యాసంగిలో సాగు చేసే పంటల్లో అలసంద సాగు రైతులకు లాభసాటిగా ఉంటుంది. అలసంద సాగుకు అనువైన నేలల్లో పంట సాగు చేస్తే మంచి దిగుబడి వచ్చే అవకాశం ఉంటుందని వ్యవసాయ శాఖ ఏడీఏ సక్రియనాయక్ రైతులకు సూచిస్తున్నారు. ఈ పంటను ఫిబ్రవరి నుంచి నెలాఖరు వరకు విత్తుకోనే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. యాసంగిలో ప్రత్యామ్నాయ పంటగా అలసంద పంటను సాగు చేసుకుంటే మంచి దిగుబడితో పాటు లాభాలు పొందవచ్చని సూచిస్తున్నారు.

మేలైన యాజమాన్య పద్ధతులు..

అలసంద సాగులో మేలైన యాజమాన్య పద్దతులు పాటించాలని వ్యవసాయ శాఖ అధికారులు వివరిస్తున్నారు. ఎకరాకు 8 నుంచి 10 కిలోల విత్తనం కావాల్సి ఉంటుందని చెబుతున్నారు. పశుగ్రాసం లేదా పచ్చిరొట్టగా సాగు చేస్తే ఎకరాకు 12నుంచి 14 విత్తనం అవసరం ఉంటుంది. కిలో విత్తనానికి 3 గ్రాముల థైరమ్ చొప్పున కలిపి తప్పనిసరిగా విత్తనశుద్ధి చేయాలి. సాళ్ల మధ్యలో 30 సెం.మీ, మొక్కల మధ్య 10 సెం.మీ. ఎడం ఉండేలా విత్తాలి. పంటకు ముందు ఆఖరి దుక్కిలో ఎకరాకు 2టన్నుల మాగిన పశువుల ఎరువు, 18 కిలోల యూరియా, 100 కిలోల సింగిల్ సూపర్ పాస్పేట్ వేసి కలియదున్నాలి.

కలుపు నివారణ..

పంట విత్తిన వెంటనే లేదా మరుసటి రోజు నేలలో తేమ ఉన్నప్పుడు 200 లీటర్ల నీటిలో 1.5 లీటర్ల పెండిమిథాలిన్ కలిపి ఎకరా విస్తీర్ణంలో పిచికారీ చేయాలి. అవసరాన్ని బట్టి సాళ్ల దంతెతో అంతరకృషి చేయాలి. ఈ పంటకు గొంగళి పురుగు, మారుక మచ్చ పురుల పురుగు, పచ్చదోమ, తెల్లదోమలతో పాటు బూడిద, పల్లాకు, ఆకు మచ్చ తెగుళ్ల ఆశించే అవకాశం ఉంది.

పంట కోత..

పంట 45రోజుల దశలో పచ్చికాయలు కోతకు వస్తాయి. మూడు రోజులకు ఒకసారి కాయలను కోయవచ్చు. ఎకరాకు 30 నుంచి 40 క్వింటాళ్ల దిగుబడి వస్తుంది. విత్తనం కోసం పండిస్తే 80 నుంచి 100 రోజులకు కాయలు సిద్ధం అవుతాయి. ఆకులు ఆకుపచ్చని రంగు నుంచి పసుపు రంగులోకి మారి రాలిపోతాయి. ఈ సమయంలో పంట కోత కోయవచ్చు.

విత్తన రకాలు..

జీసీ–3 : పంటకాలం 90–95 రోజులు. ఎకరానికి 4 నుంచి 5 క్వింటాళ్ల దిగుబడి ఉంటుంది. స్వల్పకాలికం. గుబురు రకం. పల్లాకు తెగులును తట్టుకుంటుంది. వీ–240 పంట కాలం 90–100 రోజులు. దిగుబడి ఎకరాకు 5–6 క్వింటాళ్లు ఉంటుంది. పశుగ్రాసానికి అనుకూలం. గింజలు ముదురు ఎరుపురంగులో ఉంటాయి. సీ–152 రకం పంటకాలం 105 నుంచి 110 రోజులు. దిగుబడి ఎకరాకు 3–4 క్వింటాళ్ల వరకు ఉంటుంది. అంతరపంటగా పండ్ల తోటలకు అనువుగా రకం. గింజలు పెద్ద పరిమాణంలో తెలుపు రంగులో ఉంటాయి.

నవోదయలో ప్రవేశాలకు దరఖాస్తులు

బిజినేపల్లి: వట్టెం జవహర్ నవోదయ విద్యాలయంలో 6వ తరగతిలో ప్రవేశాల కోసం ఉమ్మడి జిల్లాలో ప్రస్తుతం 5వ తరగతి చదువుతున్న విద్యార్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ భాస్కర్‌కుమార్ బుధవారం ప్రకటనలో తెలిపారు. ఆసక్తి ఉన్న విద్యార్థులు www.navodaya.gov.in వెబ్‌సైట్‌లో జనవరి 31వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. వివరాల కోసం 9440882496, 9490975070, 9441302130 నంబర్లకు సంప్రదించాలని కోరారు.

లూయిస్ బ్రెయిలీకి ఘన నివాళి



మహబూబ్‌నగర్ రూరల్: పట్టణంలో ప్రభుత్వ అంధుల ఆశ్రమ పాఠశాలలో లూయిస్ బ్రెయిలీ జయంతి వేడుకల్లో ఏపీజీవీబీ రీజినల్ మేనేజర్ సుభాష్ పాల్గొని పాఠశాల ఆవరణలో ఉన్న విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కళ్లు లేకున్నా అలాంటి భావన కల్పించకుండా అంధులు ఆశ్రమ పాఠశాలలోని అంధ విద్యార్థులు జీవించడం ఎంతో హర్షణీయమని అన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ రాములుగౌడ్, అధ్యాపకులు పాల్గొన్నారు.

అధ్యాపక పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: జిల్లా కేంద్రంలోని గిరిజన గురుకుల జూనియర్ కళాశాలలో కెమిస్ట్రీ పార్ట్‌టైం అధ్యాపక పోస్టు భర్తీకి అభ్యర్థుల నుంచి దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న వారు ఈనెల 7న కళాశాలలో నిర్వహించే డెమోకు హాజరుకావాలని పేర్కొన్నారు. మరింత సమాచారం కోసం నంబర్.8333925371ను సంప్రదించాలని పేర్కొన్నారు.

మళ్లీ ఉద్యోగ జాతర!

- గ్రామ, వార్డు సచివాలయాల్లో ఖాళీ పోస్టుల భర్తీకి సీఎం జగన్ ఆదేశం



సాక్షి, అమరావతి: గ్రామ, వార్డు సచివాలయాల్లో ప్రస్తుతం ఖాళీగా ఉన్న ఉద్యోగాలన్నీ భర్తీ చేసేందుకు సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. వైఎస్ జగన్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన వెంటనే దేశ చరిత్రలో రికార్డు స్థాయిలో ఒకేసారి దాదాపు 1.34 లక్షల ప్రభుత్వ ఉద్యోగాలను కొత్తగా మంజూరు చేయడంతో పాటు, కేవలం నాలుగు నెలల వ్యవధిలోనే వాటిని భర్తీ చేయడం తెలిసిందే. తొలి విడతలో భర్తీ కాని పోస్టులకు వరుసగా రెండో ఏడాది నియామక ప్రక్రియ చేపట్టడమూ విదితమే. ఈ నేపథ్యంలో గ్రామ, వార్డు సచివాలయాల కార్యకలాపాలకు సంబంధించి బుధవారం సీఎం తన క్యాంపు కార్యాలయంలో అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సమయంలో సచివాలయాల్లో ఇంకా ఖాళీగా ఉన్న ఉద్యోగాల భర్తీ అంశం చర్చకు వచ్చింది. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. 'గ్రామ, వార్డు సచివాలయాల్లో ఏర్పడ్డ ఖాళీలను భర్తీ చేయండి. గత నియామక ప్రక్రియను అత్యంత పారదర్శకంగా చేపట్టారని మంచి పేరు వచ్చింది. ఎలాంటి లోపం లేకుండా సమర్థవంతంగా మళ్లీ నియామక ప్రక్రియ చేపట్టాలి' అని అధికారులకు సూచించారు. అన్ని ప్రభుత్వ విభాగాల నుంచి ఖాళీల వివరాలను సేకరిస్తున్నామని అధికారులు సీఎంకు తెలిపారు.

విశాఖ డెయిరీ చైర్మన్ తులసీరావు కన్నుమూత

సాక్షి, అనకాపల్లి/అమరావతి: విశాఖ డెయిరీ చైర్మన్ ఆడారి తులసీరావు (84) బుధవారం సాయంత్రం హైదరాబాద్‌లోని కిమ్స్ ఐకాన్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ కన్నుమూశారు. ఆయన భౌతికకాయాన్ని హైదరాబాద్ నుంచి స్వగ్రామమైన అనకాపల్లి జిల్లా యలమంచిలికి తీసుకువస్తున్నారు. తులసీరావుకు ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. రెండో కుమారుడు ఆడారి ఆనంద్‌కుమార్ వైఎస్సార్‌సీపీ విశాఖ పశ్చిమ నియోజకవర్గ ఇన్‌చార్జిగా వ్యవహరిస్తుండగా.. కుమార్తె రమా కుమారి యలమంచిలి మునిసిపల్ చైర్‌పర్సన్‌గా సేవలందిస్తున్నారు. తులసీరావు అంత్యక్రియలు గురువారం యలమంచిలిలో జరుగుతాయి. ఈ కార్యక్రమానికి సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి హాజరుకానున్నారు. తులసీరావు భౌతికకాయానికి సీఎం జగన్ నివాళులర్పించి, అతని కుటుంబ సభ్యులను పరామర్శిస్తారని ముఖ్యమంత్రి కార్యాలయం తెలిపింది.

రోడ్లపై సభలు వద్దనటం తప్పా?

వరుసగా రెండు సంఘటనల్లో ఏకంగా 11 మంది ప్రాణాలు బలి

- ఇలాంటి దుర్ఘటనలకు చెక్ పెడుతూ రోడ్లపై సభలు వద్దన్న ప్రభుత్వం
- ఈ ఉత్తర్వులకు కూడా చంద్రబాబు నాయుడి వక్రభాష్యం

సాక్షి, అమరావతి: అసలు ఆ జీవోలో తప్పేమయినా ఉందా? రోడ్లపై సభలు, సమావేశాలను వద్దనటం మంచిదా... చెడ్డదా? అది కూడా కావాలని ఇరుకు రోడ్లో సభ నిర్వహించడంతో 8 మంది ప్రాణాలు కోల్పోయాక... అటువంటి సంఘటనలు ఇక పునరావృతం కాకూడదన్న ఉద్దేశంతో ప్రభుత్వం ముందుకు కదిలి ఇలాంటి ఉత్తర్వులు జారీ చేయటం సమంజసం కాదని అనగలమా? ఇవేమీ ఒక పార్టీనో, ఒక నాయకుడినో దృష్టిలో పెట్టుకుని ఇచ్చిన ఉత్తర్వులు కాదు కదా?!. రోడ్లపై సభలు పెట్టకూడదన్నది అన్ని పార్టీలకూ, అందరు నాయకులకూ సమానంగా వర్తించే అంశం. ఇది తప్ప వేరే కార్యక్రమాలేమైనా రోడ్లపై చేసుకోవాలంటే దానికి పోలీసుల నుంచి ముందస్తు అనుమతి తీసుకుంటే చాలని ఆ ఉత్తర్వుల్లోనే ఉంది. మరిప్పుడు దేన్ని తప్పు బడుతున్నారు? రోడ్లపై సభలు, సమావేశాలు వద్దనటాన్నా? లేక మిగతా కార్యక్రమాలకు ముందస్తు అనుమతి తీసుకోవాలనటాన్నా? వై.ఎస్.జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వం ఏ నిర్ణయం తీసుకున్నా దానికి దురుద్దేశాలు ఆపాదిస్తూ దుష్ప్రచారానికి దిగుతున్నారనేది మరోసారి తేటతెల్లం కావటం లేదా? ఇన్ని మరణాలు సంభవించాక కూడా ప్రభుత్వం ఎలాంటి చర్యలూ తీసుకోకుండా ఉంటే చంద్రబాబుకు వంత పలికే ఇతర ప్రతిపక్ష పార్టీలు, మీడియా దీన్ని ఆక్షేపించకుండా ఉంటాయా? రాజకీయ ప్రయోజనాలు తప్ప ప్రజల భద్రతతో ఏమాత్రం సంబంధం లేనట్లు వ్యవహరిస్తున్న తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబును ఏమనుకోవాలి? ఇరుకు రోడ్డులోకి కావాలని వాహనాన్ని పోనిచ్చి సభ నిర్వహించి, 8 మంది ప్రాణాలు బలితీసుకున్న ప్రతిపక్ష నాయకుడిలో కాస్తయినా పశ్చాత్తాపం కనిపించాలి కదా? పదుల సంఖ్యలో జనం గాయపడినా కూడా ఏమాత్రం బాధపడకుండా రోడ్లపై మరో సభకు తయారై... దాన్ని ఎందుకు అడ్డుకుంటారంటూ రభస చేయటం సరైనదేనా?

మరిన్ని వార్తలకు ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి

ఎందుకిచ్చారు ఈ జీవో..?

ప్రతిపక్షాల గొంతునొక్కేందుకే ప్రభుత్వం ఈ జీవో జారీ చేసిందంటూ టీడీపీ చేస్తున్న ప్రచారంలో అక్షరం కూడా నిజం లేదన్నది యథార్థం. ఎందుకంటే చంద్రబాబు నాయుడి పబ్లిసిటీ దాహంతో నెల్లూరు జిల్లా కందుకూరులో రోడ్డుపై నిర్వహించిన సభలో 8 మంది దుర్మరణం చెందారన్నది విస్మరించలేని విషాదం. నాలుగు రోడ్ల కూడలిలో కాస్త విశాలమైన ప్రాంతంలో సభ నిర్వహిస్తామని ముందుగా అనుమతి తీసుకున్న చంద్రబాబు... కేవలం తన సభకు వచ్చిన జనాన్ని తక్కువ మందిని కూడా రద్దీరద్దీగా బీభత్సమైన స్థాయిలో చూపించాలన్న వ్యూహాన్ని ఎంచుకున్నారు. అందుకోసం డ్రోన్లతో షూటింగ్‌కు సిద్ధమయ్యారు. తీరా సభా స్థలమయిన ఎన్టీఆర్ సర్కిల్‌కు వచ్చేసరికి జనం అనుకున్నంతగా లేరని భావించారు. ఆ విశాలమైన రోడ్లోంచి తన వాహనంతో సహా కాన్వాయ్‌ని మరో 50–70 మీటర్లు ముందుకు... ఇరుకు రోడ్లోకి పోనిచ్చారు. అసలే ఇరుకు రోడ్డు... దానికి అటూ ఇటూ ఫ్లెక్సీలు కట్టడంతో మరింత కుదించుకుపోయింది. అన్ని వాహనాలు అంత చిన్న రోడ్లోకి దూసుకు రావటంతో... అప్పటిదాకా అక్కడ నిల్చుని ఉన్న జనం వెనక్కి వెళ్లాల్సి వచ్చింది. ఒకరినొకరు నెట్టుకుంటూ వెనక్కి వెళ్లే క్రమంలో కొందరు కింద పడిపోయారు. ఆ తోపులాటలో వారిని గమనించే పరిస్థితి లేక.. వారిని తొక్కుకుంటూనే మిగిలిన వారు వెనక్కి వెళ్లారు. దీంతో దాదాపుగా ఎనిమిది మంది అమాయకులు ప్రాణాలు కోల్పోయారు. ఇరుకు రోడ్లో తక్కువ జనం వచ్చినా... పై నుంచి డ్రోన్లతో షూట్ చేస్తే భారీగా వచ్చినట్లు కనిపిస్తారని, దాన్నే ప్రచారానికి వాడుకోవచ్చని బాబు వేసిన వ్యూహం బెడిసికొట్టడమే ఈ నిండు ప్రాణాలను బలితీసుకుందని చెప్పటానికి వేరే ఏమీ అక్కర్లేదు.

అసలు ఆ జీవోలో ఏముంది?

ఇదిగో... ఈ సంఘటన నేపథ్యంలోనే ప్రజల ప్రాణాలను కాపాడటం తన బాధ్యతగా భావించి ప్రభుత్వం జీవో నెంబర్–1 జారీ చేసింది. పబ్లిసిటీ కోసం ఇరుకు రోడ్లలో జనాన్ని షూట్ చేసి.. మరిన్ని మరణాలకు కారణమయ్యే సంఘటనలేవీ జరగకుండా ముందస్తు జాగ్రత్తగా ఈ జీవో జారీ చేసింది. అయితే ఈ జీవోలో... సభలు నిర్వహించకూడదని ఎక్కడా చెప్పలేదు. రోడ్లపై మాత్రమే నిర్వహించవద్దన్నారు. మైదానాలు, ఇతర ప్రత్యామ్నాయ ప్రదేశాల్లో సభలు నిర్వహించుకోవచ్చు. అందుకోసం గ్రామ, మండల, మున్సిపాలిటీల పరిధిలో ప్రత్యామ్నాయ ప్రదేశాలను గుర్తించాలని కూడా అధికార యంత్రాంగాన్ని స్వయంగా ప్రభుత్వమే ఆదేశించింది. అంటే ఏదైనా గ్రామంలో గానీ పట్టణంలో గానీ రోడ్లపై మాత్రమే సభలు నిర్వహించకూడదు. అక్కడి కాలేజీ మైదానాలు, ఇతర బహిరంగ ప్రదేశాల్లో నిర్వహించుకోవచ్చు. అందుకు దరఖాస్తు చేస్తే పోలీసులు అనుమతిస్తారు. కాబట్టి ప్రభుత్వం జారీ చేసిన జీవో సభల నిర్వహణకు ఏ విధంగానూ అడ్డంకి కాదు. వీటన్నిటికీ తోడు... రోడ్లపై సభలు వద్దన్న నిబంధనకు అత్యవసర పరిస్థితుల్లో ప్రభుత్వం మినహాయింపులిచ్చింది. ప్రత్యేక పరిస్థితుల్లో సభలు నిర్వహించాలని భావిస్తే అందుకు కారణాలను వివరిస్తూ జిల్లా ఎస్పీ/ పోలీస్ కమిషనర్‌కు దరఖాస్తు చేసుకోవాలి. సభ నిర్వహించే సమయం, ప్రవేశ, నిష్క్రమణ మార్గాలు, హాజరయ్యే జనం, ఇతర ఏర్పాట్ల వివరాలను తెలియజేస్తూ దరఖాస్తు చేయాలి. వాటిని పరిశీలించి పోలీసులు సంతృప్తి చెందితే సభ నిర్వహణకు షరతులతో అనుమతినిస్తారు. అనుమతి కోసం పేర్కొన్న షరతులకు విరుద్ధంగా సభను నిర్వహిస్తే మాత్రం నిర్వాహకులపై కఠిన చర్యలు తీసుకుంటారు.

బాబు మరో షో!

▶ మొదటి పేజీ తరువాయి

నోటీసులు ఇచ్చారు. చంద్ర బాబు కార్యక్రమాల వివరాలు ఏమిటి? ఎక్కడెక్కడ పర్యటించనున్నారు? బహిరంగ సభలు ఎక్కడ నిర్వహించనున్నారు? రోడ్‌షోలు ఎక్కడ? ర్యాలీలు ఉన్నాయా? అనే వివరాలు తెలియజేసి, అనుమతి తీసుకోవాలని సోమవారం రాత్రే నోటీసు ఇచ్చారు. అయితే మంగళవారం అర్ధరాత్రి వరకు చంద్రబాబు నుంచి కానీ, ఆయన పీఏ నుంచి కానీ పోలీసులకు ఎటువంటి సమాచారం లేదు. దీంతో చంద్రబాబు పర్యటనకు సంబంధించి తమకు ఎటువంటి సమాచారం లేదని, సభలు, సమావేశాలకు అనుమతులు లేవంటూ మంగళవారం అర్ధరాత్రి పోలీసులు లిఖిత పూర్వకంగా సమాచారం ఇచ్చారు.

అంతా పథకం ప్రకారమే..: చంద్రబాబు పర్యటనపై బుధవారం సాయంత్రం వరకు పోలీసులకు ఎటువంటి సమాచారం లేదు. అయితే టీడీపీ శ్రేణులు ఏపీ, కర్ణాటక సరిహద్దు లోని శాంతిపురం మండలం 121 పెద్దూరు, గడ్దూరు క్రాస్ వద్ద హంగామా చేస్తున్నారని పోలీసు లకు సమాచారం అందింది. శాంతి భద్రతల్లో భాగంగా పోలీసులు ఆ ప్రాంతంలో బారికేడ్లు ఏర్పాటు చేశారు. చంద్రబాబు పర్యటనకు కుప్పం వాసుల నుంచి పెద్దగా స్పందన లేకపోవడంతో టీడీపీ శ్రేణులు మదనపల్లె, వీ.కోట, కర్ణాటక నుంచి ప్రత్యేక వాహనాల్లో జనాన్ని తీసుకు రావడం ప్రారంభించారు. దీంతో పోలీసులు అనుమతి లేని వాహనాలకు ప్రవేశం లేదని వాటిని నిలువరించే ప్రయత్నం చేశారు. ఇక్కడి విషయాలను మాజీమంత్రి అమర్‌నాథ్‌రెడ్డి, చంద్రబాబు పీఏ, మాజీ ఎమ్మెల్సీ శ్రీనివాసులు ఎప్పటికప్పుడు బాబుకు ఫోన్ ద్వారా చెబుతూ వచ్చారు.

డ్రామాను రక్తి కట్టించాలని..: కుప్పం వాసుల నుంచి స్పందన లేకపోవడం గ్రహించిన చంద్రబాబు.. తన ఎల్లో మీడియా ద్వారా ప్రచారానికి తెరతీశారు. బాబు పర్యటనను అడ్డుకుంటున్నారంటూ.. టీడీపీ శ్రేణుల ద్వారా హడావుడి చేయించారు. తన జనాన్ని రెచ్చగొట్టి పోలీసుల పైకి ఉసిగొల్పారు. పోలీసులు లాఠీచార్జ్ చేస్తే ప్రభుత్వంపై వ్యతిరేకత పెంచవచ్చనే ఉద్దేశంతో కొందరు టీడీపీ శ్రేణులను సామాన్య జనం రూపంలో గడ్దూరు క్రాస్ వద్దకు పంపించారు. వారి వద్ద రాడ్లు, కర్రలు, రాళ్లు కనిపించాయి. వారి ద్వారా గొడవ సృష్టించి లబ్ధి పొందడానికి విఫల యత్నం చేశారు.

1861 పోలీసు చట్టమే వర్తించదంటూ వక్రభాష్యం

చంద్రబాబుకు చట్టాల పట్ల కనీస అవగాహన లేదని మరోసారి నిరూపితమైంది. రోడ్లపై సభలకు అనుమతులు రద్దు చేస్తూ ప్రభుత్వం 1861 పోలీసు చట్టం ప్రకారం జీవోను జారీ చేసింది. అయితే ఆ చట్టం ఆంధ్రప్రదేశ్‌కు వర్తించదని చంద్రబాబు పోలీసులతో వాగ్వాదం పెట్టుకోవడం విస్మయ పరిచింది. శాంతిభద్రతల పరిరక్షణ కోసం 30 పోలీస్ యాక్ట్‌ను ఇక్కడ ఎలా అమలు చేస్తారని కూడా ఆయన ప్రశ్నించారు. ఒక్క మన రాష్ట్రంలోనే కాదు.. కేంద్ర పోలీసు బలగాలతోపాటు దేశంలోని అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లోని పోలీసు వ్యవస్థలు 1861 పోలీస్ యాక్ట్ ప్రకారమే పని చేస్తున్నాయని నిపుణులు స్పష్టం చేస్తున్నారు. చంద్రబాబు సీఎంగా ఉన్న రోజుల్లో కూడా రాష్ట్రంలో ఎన్నోసార్లు 30 పోలీస్ యాక్ట్ అమలు చేశారు.

జనం ముసుగులో పోలీసులపై దాడి: బుధవారం ఉదయం నుంచే గడ్దూరు వద్ద వందలాది మంది టీడీపీ కార్యకర్తలు, అద్దె మనుషులు ఇరుకైన రోడ్లపై గుమికూడారు. దీనిపై పోలీసులు అభ్యంతరం తెలిపారు. అనుమతిలేని కార్యక్రమాలకు ఇలా మూకుమ్మడిగా రావడం సరికాదని నచ్చచెప్పే ప్రయత్నం చేశారు. టీడీపీ కార్యకర్తలు ససేమిరా అన్నారు. సభలో పాల్గొంటామని, ఎవరు ఏం చెప్పినా వినబోమంటూ తిరగబడ్డారు. మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు తెలుగు తమ్ముళ్లను మరింత రెచ్చగొట్టారు. పోలీసులపై దాడికి దిగేలా ఉసిగొల్పారు. దీంతో కార్యకర్తలు ఆగ్రహంతో ఊగిపోయారు. రోడ్డుపై ఏర్పాటు చేసిన బ్యారికేడ్లను లాగేశారు. రోడ్డుపై బైఠాయించారు. 'సీఎం డౌన్‌డౌన్.. ఇదేం ఖర్మ.. ఇదేం ఖర్మ..' అంటూ నినాదాలతో రెచ్చిపోయారు. పోలీసులకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ.. వారి వద్ద ఉన్న లాఠీలను లాక్కునే యత్నం చేశారు. ఈ గందరగోళం మధ్య కొందరు టీడీపీ కార్యకర్తలు పోలీసులపై పిడిగుద్దులతో దాడి చేశారు. పోలీసులు కూడా లాఠీలను పైకెత్తి వారిని తరిమే ప్రయత్నం చేశారు. ఈ సందర్భంగా పోలీసులు, టీడీపీ కార్యకర్తల నడుమ తోపులాట జరిగింది. సాయంత్రం 4 గంటలకు కర్ణాటక సరిహద్దు నుంచి చంద్రబాబు 121 పెద్దూరు చేరుకున్నాక టీడీపీ శ్రేణులు మరింతగా రెచ్చిపోయాయి. ఇంకో వైపు తమను అడ్డుకుంటున్నారంటూ ఎల్లో మీడియా ద్వారా బ్రేకింగ్ న్యూస్‌లు వేయించారు. ఉదయం నుంచి ఇలా జరిగేలా చంద్రబాబు ప్రణాళిక రచించి, అమలు చేయించారని స్పష్టమైంది. ఇలా గొడవ చేయడం ద్వారా పోలీసులు తనను అరెస్టు చేసేలా వ్యూహం పన్నారు. అయితే పోలీసులు ఏమాత్రం సంయమనం కోల్పోకుండా చంద్రబాబు, టీడీపీ నేతలు, శ్రేణులను సమర్థవంతంగా కట్టడి చేశారు.

పబ్లిసిటీ కోసమే స్పందించలేదు..: కందుకూరు, గుంటూరు ఘటనల నేపథ్యంలో ప్రభుత్వం ప్రత్యేక జీఓ ఇచ్చిన విషయం తెలిసీ తెలియనట్లు బాబు వ్యవహరించారు. అందులో భాగంగానే పోలీసులు ఇచ్చిన నోటీసులకు సమాధానం ఇవ్వొద్దని తన పీఏ మనోహర్‌కు ఫోన్ ద్వారా సూచించినట్టు విశ్వసనీయ సమాచారం. నోటీసులకు సమాధానం ఇవ్వకపోతే పోలీసులు అడ్డుకుంటారని, ఆ విషయాన్ని విస్తృతంగా ప్రచారం చేసి పబ్లిసిటీ పొందవచ్చనేది బాబు ఉద్దేశమని ఆ పార్టీ కుప్పం నేత ఒకరు తెలిపారు.

కొత్త జీవో చెల్లదు

- నా సభలకు జన స్పందన చూసి ఓర్వలేకే కొత్తచట్టాలు: చంద్రబాబు

సాక్షి, చిత్తూరు: బ్రిటిష్ కాలం నాటి 1861 యాక్ట్ 30 ప్రకారం ప్రభుత్వం ఇచ్చిన జీవో నంబర్ 1 చెల్లదని, దాని ప్రకారం తనను అడ్డుకోవడం సబబు కాదని టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు అన్నారు. బుధవారం సాయంత్రం కుప్పం నియోజకవర్గ పర్యటనలో భాగంగా శాంతిపురం మండలం 121 పెద్దూరుకు ఆయన ర్యాలీగా వస్తుండగా.. రోడ్‌షో, సభలకు ముందస్తు అనుమతి తప్పనిసరి అని డీఎస్పీ సుధాకర్‌రెడ్డి నోటీసు ప్రతులు అందజేశారు. ఈ సందర్భంగా చంద్రబాబు పోలీసు అధికారులపై తీవ్ర స్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. తన మేనేజర్‌కు ఇచ్చిన నోటీసులు తిరిగి తనకే ఇవ్వడం సరికాదని, ఎందుకు అడ్డుకుంటున్నారో రాత పూర్వకంగా ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా చంద్రబాబు అక్కడే ఉన్న టీడీపీ కార్యకర్తలను ఉద్దేశించి ప్రసంగించారు. ఓడిపోతామనే భయంతోనే జగన్‌రెడ్డి తన సభలను అడ్డుకునేందుకు ఇలాంటి పనికి మాలిన జీవోలు తీసుకువచ్చారన్నారు. ఆంధ్రప్రదేశ్‌కు వర్తించని చట్టాన్ని ఎలా అమలు చేస్తారని ప్రశ్నించారు. కొత్త జీవో ప్రకారం పోలీసు యాక్ట్ 30.. 1వ తేది నుంచే అమల్లోకి వచ్చిందని డీఎస్పీ చెబుతుండగా, ఒకవేళ 1861 చట్టం అమల్లో ఉంటే కొత్తగా జీవో తీసుకురావాల్సిన అవసరం ఏముందని నిలదీశారు. కొత్త జీవో తీసుకురావాలంటే గెజిట్ ద్వారా చట్టబద్ధత ఉండాలని చెప్పారు. రాష్ట్రంలో పాలన బ్రిటిష్ వారికంటే దారుణంగా తయారైందని మండిపడ్డారు. తన సభలకు వస్తున్న జన స్పందన చూసి ఓర్వలేక కొత్త చట్టాలు తెస్తున్నారన్నారు.

రామన్‌పాడులో 1,020 అడుగుల నీటిమట్టం

మదనాపురం: మండలంలోని రామన్‌పాడు జలాశయంలో బుధవారం 1,020అడుగుల నీటిమట్టం వచ్చి చేరింది. జూరాల ఎడమ కాల్వ ద్వారా 820, సమాంతర కాల్వ ద్వారా 150 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో కొనసాగుతుంది. ఎన్టీఆర్ కాల్వ ద్వారా 950, తాగునీటి అవసరాల కోసం 20 క్యూసెక్కుల నీటిని వినియోగిస్తున్నారు.

జోరుగా సాగిన ఉల్లి వ్యాపారం



దేవరకద్ర: స్థానిక మార్కెట్ యార్డులో బుధవారం ఉదయం ఉల్లి వ్యాపారం జోరుగా సాగింది. వివిధ గ్రామాల నుంచి రైతులు ఉల్లిని అమ్మకానికి తేవడంతో మార్కెట్ కళకళలాడింది. ముగిసిన వానాకాలం సీజన్‌లో ఉల్లి సాగు తక్కువ విస్తీర్ణంలో చేయడం వల్ల దిగుబడులు తక్కువగా మార్కెట్‌కు వస్తున్నాయి. దిగుబడులు లేకున్నా ధరలు మాత్రం నిలకడగానే కొనసాగుతున్నాయి. కర్ణాటక, మహారాష్ట్ర మార్కెట్‌ల నుంచి ఉల్లి దిగుబడులు వస్తుండం వల్ల ధరలు పెరగడం లేదని వ్యాపారులు అంటున్నారు. మార్కెట్‌లో నిర్వహించిన బహిరంగ వేలంలో ఉల్లి గరిష్ట ధర క్వింటాల్‌కు రూ.1,600, కనిష్ట ధర రూ.1,450 పలికాయి. 45 కేజీల బస్తా ధర గరిష్ఠంగా రూ.800, కనిష్ఠంగా రూ.750 వరకు విక్రయించారు.

సోలార్‌తో ఇంధన పొదుపు

ఖిల్లాఘనపురం: సోలార్‌తో ఇంధన పొదుపు సాధ్యమవుతుందని గ్రీన్ ఉర్జా టెక్నాలజీ సిస్టమ్ సభ్యుడు వీసీహెచ్ నర్మద, అమిత్ కుమార్ పాండే అన్నారు. బుధవారం మండలంలోని పర్వతాపురంలో ఇంధన పొదుపు, సౌర విద్యుత్‌పై సర్పంచ్ నిర్మల ఆధ్వర్యంలో ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో విద్యుత్ వినియోగం ఎక్కువైందన్నారు. సోలార్‌ను ఉపయోగించడం వల్ల విద్యుత్‌ను పొందుపు చేయవచ్చని తెలిపారు. పర్వతాపురాన్ని సోలార్ గ్రామంగా మార్చేందుకు కృషి చేస్తామని తెలిపారు.



ఉత్సవాలకు మైసమ్మ ఆలయం ముస్తాబు



దట్టమైన అడవి మధ్యలో మైసమ్మ దేవాలయం

- 7వ తేదీ నుంచి పర్వతాపూర్ మైసమ్మ బ్రహ్మోత్సవాలు

నవాబుపేట: భక్తుల కొంగుబంగారం.. సెంటిమెంట్ దేవత, కోరిన కోర్కెలు తీర్చే ఇలవెల్పు, అమ్మలగన్న అమ్మ పర్వతాపూర్ మైసమ్మ. మహబూబ్‌నగర్ జిల్లా నవాబుపేట మండల కేంద్రానికి 9కిలోమీటర్ల దూరంలో అడవి మధ్యలో అమ్మవారు కొలువుదీరారు. ఇక్కడికి ఉమ్మడి జిల్లావ్యాప్యంగా భక్తులు వస్తుంటారు. పచ్చని చెట్లమధ్యలో ప్రశాంత వాతావరణం ఈ ఆలయం వద్ద భక్తులు ఎంతో ఆస్వాదిస్తారు. ఈ నెల 7వ తేదీ నుంచి ఉత్సవాలు ప్రారంభం కానున్నాయి.

దారి చూపిన దేవత..

ప్రస్తుత ఆలయ స్థలంలోనే ఒక నెమలి చెట్టు కింద పుట్టలో మైసమ్మ దేవతా విగ్రహం బయట పడిందని పూర్వీకులు చెపుతున్నారు. చాలాసంవత్సరాల క్రితం కట్టెలు కొట్టి అమ్ముకునే వ్యక్తి అడవిలో దారి తప్పితే, అతనికి చెట్టుకింద ఉన్న శిల ఒక ప్రత్యేక కాంతి రూపంలో దారి చూపిందని, ఆ వ్యక్తి మరుసటి రోజు గ్రామస్తులకు ఈ విషయం చెప్పారని, అప్పటినుంచే అమ్మవారికి పూజలు చేయటం ప్రారంభించినట్లు దేవాలయ చరిత్ర.



మైసమ్మ దేవత



దేవాలయ స్వాగత తోరణం

ఉత్సవాలు..

జనవరి 7వ తేదీన ధ్వజారోహణ, కలశస్థాపనం, 8న కవచ ధారణ, 9వ తేదీన అగ్నిస్థాపన, చండీహోమం, 10న బోనాలు, శకటోత్సవం, 11న మహా మంగళహారతి ఉంటుందని, భక్తులకు అన్ని ఏర్పాట్లు చేశామని ఆలయ చైర్మన్ గోపాల్, అధికారి మధనేశ్వర్‌రెడ్డి తెలిపారు.

సెంటిమెంట్ దేవత..

ఇక్కడ జిల్లావాసులు చాలామంది కొత్త వాహనం తెచ్చినా, కొత్త కార్యక్రమాలు ప్రారంభించాలన్నా.. ఎన్నికల ప్రచారాలు సైతం ఈ దేవాలయం నుండే ప్రారంభించటం సెంటిమెంట్‌గా మారింది. దీంతో పాటు ఆది, మంగళవారాలు వేలసంఖ్యలో భక్తులు అమ్మవారికి ప్రత్యేక బోనాలు సమర్పించడం ప్రత్యేకం.

దేవాలయ అభివృద్ధి..

దేవాలయం ఒక మామూలు రాతి గుడితో ఉండేది. కాకర్లపహాడ్‌కు చెందిన నారాయణరెడ్డి అనే వ్యక్తి మొదట గుడి నిర్మాణం చేపట్టగా, అనంతరం స్వర్గీయ ఎర్రసత్యం అప్పటి ఎమ్మెల్యే చొరవతో తాగునీటి సదుపాయం కల్పించారు. అలాగే చంద్రశేఖర్, ఎర్రశేఖర్, రావుల చంద్రశేఖర్‌రెడ్డి, రుమాండ్ల రాంచంద్రయ్య, లక్ష్మారెడ్డి, మల్లు రవి, ఎంపీ శ్రీనివాస్‌రెడ్డి తదితరులు ఆలయ అభివృద్ధికి కృషి చేశారు.

- భయంకరమైన మలుపులు ఉండటంతో నిత్యం రోడ్డు ప్రమాదాలకు నెలవుగా ఉన్న తరుణంలో రోడ్డును తాజా ఎమ్మెల్యే, మాజీ మంత్రి లక్ష్మారెడ్డి అభివృద్ధి చేశారు. డబుల్ రోడ్డు వేయించడంతో రోడ్డు ప్రమాదాలకు చెక్ పడింది. రోజురోజుకూ ఆలయం మరింత అభివృద్ధి చెందుతోంది.

బీజేపీతోనే రాష్ట్ర అభివృద్ధి

- త్వరలోనే కల్వకుంట్ల కవిత జైలుకెళ్లడం ఖాయం
- కుటుంబ పాలనకు చరమగీతం పాడాలి
- మాజీ ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి



మాట్లాడుతున్న కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి

కొల్లాపూర్ రూరల్: రాబోయే ఎన్నికల్లో రాష్ట్రంలో కాషాయ జెండా ఎగరాలని, బీజేపీ ద్వారానే అభివృద్ధి సాధ్యమని మాజీ ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని నార్లాపూర్‌కు పార్టీ జిల్లా అధ్యక్షుడు సుధాకర్‌రావు చేస్తున్న ప్రగతి కోసం పాదయాత్ర చేరుకుంది. ఈ సందర్భంగా పాదయాత్రకు కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి సంఘీభావం తెలిపి, సభలో ప్రసంగించారు. రాష్ట్రంలో తమ పార్టీ అధికారంలోకి వస్తే వృద్ధాప్య పింఛన్ రూ.3వేలు చేస్తామన్నారు. రాష్ట్రంలో ప్రాజెక్టులు ఆంధ్రా కాంట్రాక్టర్ల కోసం కడుతున్నరని విమర్శించారు. ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రాజెక్టుల పేరుతో రూ.లక్ష కోట్లు దోచుకున్నారని ఆరోపించారు. కల్వకుంట్ల కవిత రాష్ట్రంలో 600 వైన్‌షాపులు పెట్టిందని విమర్శించారు. అందుకు రూ.200 కోట్లు ముడుపులు ముట్టాయని అన్నారు. త్వరలో ఆమె జైలుకు పోవడం ఖాయమన్నారు. కొల్లాపూర్‌లో కాషాయ జెండా ఎగురుతుందన్నారు. అందుకు ప్రత్యేకశ్రద్ధ పెట్టి కృషి చేస్తానన్నారు. కాంగ్రెస్ పార్టీ నుంచి గెలుపొందిన ఇక్కడి ఎమ్మెల్యే బీఆర్‌ఎస్‌కు అమ్ముడుపోయాడన్నారు. ఆయనను బీజేపీ కొనుగోలు చేసేందుకు ప్రయత్నించిందని చెప్పడం హాస్యాస్పదమన్నారు. జిల్లా అధ్యక్షుడు మాట్లాడుతూ కొల్లాపూర్ అభివృద్ధి కోసం 38 రోజుల నుంచి పాదయాత్ర చేస్తున్నట్లు తెలిపారు. తనను గెలిపిస్తే రైల్వే లైన్ తెప్పిస్తానని హామీ ఇచ్చారు.



మక్తల్ మండలం మాద్వార్‌లో కలశంతో వెళ్తున్న మాలాధారులు (ఫైల్)

హరహర మహాదేవ శంభోశంకర

- రేపటి నుంచి శివదీక్షలు ప్రారంభం
- నిష్ఠతో 41రోజుల పాటు మాలధారణ

మక్తల్: హరహర మహాదేవ శంభోశంకర అంటూ శివభక్తులు శివదీక్షలు తీసుకునే సమయం ఆసన్నమైంది. మాలధారణ చేస్తే సమస్యలు దూరమై మనుస్సుకు ప్రశాంతత ఉండడంతో పాటు చెడుకు దూరంగా... పరమశివుడు సూచించిన నడవడికకు అనుగుణంగా ఉండేందుకు చాలా మంది ప్రతి యేటా శివదీక్షలు చేపడుతారు. భక్తులు తమ జీవితకాలంలో చేసిన తప్పులను మన్నింపమని.. ఇకపై భక్తితో, ఇతరుపట్ల ప్రేమ, దయ, పరోపకారిగా ఉంటానని ప్రమాణం చేస్తూ శివదీక్షలు తీసుకుంటారు. ఇందుకు అనుగుణంగానే 41 రోజుల పాటు నిష్ఠతో శివుడికి ప్రత్యేక పూజలు చేసి శివుడికి ప్రత్యేక పూజలు చేస్తారు. ప్రతియేటా భక్తులు చేపట్టే శివదీక్షలు శుక్రవారం నుంచి ఉమ్మడి జిల్లాలో ప్రారంభం కానున్నాయి.

భక్తి మార్గంతో మార్పు..

భగవంతుడిపై అధ్యాత్మిక చింతన కలిగిన భక్తులు మాలధరణ తీసుకుంటారు. శివుడిని అందరూ ఆదిగురువుగా విశ్వసిస్తారు. త్రేతాయుగంలో పార్వతి, ద్వాపర యుగంలో అర్జునుడు ఇలా ఎంతో మంది ముని మహారాజులు దీక్షలు, భక్తి భావాలను గురించి కథలు చెబుతుండేవారు. జగద్గురు ఆదిశంకరాచార్యులు శివానందలహరితో శివుడిని కొలిచేవారని పురాణాలు చెబుతున్నాయి. ఎంతో మంది శివభక్తులు శివుడిని ఆరాధిస్తూ నిష్ఠతో 41 రోజులుగా శివదీక్షలను చేపడుతున్నారు. దీక్షల అనంతరం శ్రీశైలంలోని మల్లికార్జున స్వామి సన్నిదిలో దీక్షలను విరమిస్తారు. మండల దీక్షలు జనవరి 6, 7, 8 తేదీల్లో తీసుకొని 41రోజులు ఉంటారు. అర్ధమండల దీక్షలు ఫిబ్రవరి 26, 27, 28, తేదీల్లో మాలధారణ తీసుకుంటారని వేదపండితులు తెలిపారు. మాలధారణ తీసుకున్న వారు మహాశివరాత్రి ఫిబ్రవరి 18వ తేదీన అమవాస్య వరకు ముగుస్తుంది.

పాటించాల్సిన నియమాలు..

- శివదీక్షలు తీసుకున్న వారు స్వయంగా శివభావన కలిగిన గోధుమరంగు వస్త్రాలను ధరించాలి.
- ఒక్క పూట మాత్రమే భోజనం చేయాలి.
- అరుణోదయం, మధ్యాహ్నం, సాయంత్రం శివపూజను ఆచారించాలి.
- ప్రతి ఒక్కరూ భక్తిభావన, ఆధ్యాత్మికత, శాంతితో మెలగాలి.
- సూర్యోదయం పూర్వ, సూర్యస్తమయ సమయంలోనే చల్లని నీటితో స్నానం చేయాలి. ఎనిమిది శతకమాన పూజలు చేసేందుకు సాధ్యంకాని వారు స్వాములు లింగాష్టకం పఠించి పంచాక్షరి మంత్రాన్ని 108 సార్లు జపించాలి. నేలపైన పడుకోవాలి.
- పదేళ్లలోపు స్త్రీలు, రుతుక్రమం లేనివారు, 60ఏళ్ల వయస్సు వారు దీక్షను ఆచరించవచ్చు.
- ఏకాగ్రతతో మంచి మనుస్సుతో పూజను ఆచారించాలి. విభూది, కుంకుమ, చందనం ధరించాలి.

దీక్షలో చేయకూడని పనులు..

- క్షవరం చేయడం, గోళ్లు తీయడం, ధూమపానం, మద్యపానం, చెడు అలవాట్లకు దూరంగా ఉండాలి.
- దీక్షలు పూర్తయ్యే వరకు పాదరక్షలు ధరించరాదు.

భక్తిభావంతో మెలగాలి..



ప్రతి ఒక్క శివభక్తుడు శివుడి ఆధ్యాత్మిక సందేశాలతో గడపాలి. గురు శివదీక్షను ధరించి ప్రస్తుతం 33వ సారి మాలాధరణ తీసుకుంటున్నా. దీక్ష తీసుకోవడం వల్ల ఎంతో మేలు చేకూరుతుంది. ఇతరుల పట్ల మంచి ప్రవర్తనలతో మెలగాలి. స్థానిక మల్లికార్జున స్వామి ఆలయంలో శివదీక్ష మాలధారణ ఇవ్వడం జరుగుతుంది.

– తిప్పయ్యస్వామి, పూజారి, మక్తల్